దక్షిణకాశి - కాణిపాకం
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



సెల్ నెం. 9949010118
నందన్ ఎలక్ట్రానిక్స్
డీలర్స్ ఇన్ : సెక్యూరిటీ సిస్టం, సీసీ కెమెరాస్, బయోమెట్రిక్ అండ్ ఫైర్ సేఫ్టీ
Opp. Water Tank, Durga Nagar Junction, Mailrdevpally, Hyderabad-05
UNICAM SYSTEMS CP PLUS enhancing vision Panasonic HIKVISION



విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 193 | ది. 7-10-2025 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-
VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 193 | Date : 7-10-2025 | Tuesday | Pages : 8 | Rs.1/-


# విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుదాం



- పావలా వడ్డీకే అందరికీ విదేశీ విద్యా రుణాలు
- విదేశాల్లో చదవాలనుకునేవారికి ప్రభుత్వ హామీ
- అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడమే లక్ష్యం
- సంక్షేమ శాఖలదే 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' అమలు బాధ్యత
- సంక్షేమ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని విద్యార్థులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో వరం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతీ విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిమితి లేకుండా, ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండాలని చెప్పారు. అలాగే దేశంలో ఐఐటీ, ఐఐఎం నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం వర్తింప చేయాలని సూచించారు. ఇందులో 4 శాతం వడ్డీకే బ్యాంకు రుణాలు ఇవ్వడంతో పాటు, దానికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని సీఎం చెప్పారు. 14 ఏళ్లలో రుణాన్ని చెల్లించుకునే వెసులుబాటు ఇస్తామని అన్నారు. మరోవైపు బీసీ విద్యార్థులు ఐఐటీ, నీట్‌లో కోచింగ్ కోసం రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ సంక్షేమంపై మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, ఫరూఖ్, సవిత, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**అందరికీ నాణ్యమైన విద్య అందాలి..** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని సీఎం చెప్పారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థితులు ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. నసనకోట, ఆత్మకూరు బీసీ బాలికల పాఠశాలను రూ.2.65 కోట్లతో జూనియర్ కాలేజీగా ఉన్నతీకరించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. అలాగే తల్లికి వందనం పథకం నుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు నిధులు ఇస్తామని వెల్లడించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లు కాలేజీలకు చెల్లించకపోవడంతో విద్యార్థులే రూ.900 కోట్లు చెల్లించారని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఇంకా యాజమాన్యాలకు సుమారు రూ.800 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చెల్లించాల్సి ఉందని వివరించారు.

**అన్నివర్గాలు బలోపేతం కావాలి..** సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యత తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్‌లు, పాస్టర్లకు బకాయిలు ఏమైనా ఉంటే వెంటనే విడుదల చేయాలని... అలాగే హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వక్ఫ్ ప్రాపర్టీ ఆడిట్ జరిగింది... అయితే ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెసుకునేందుకు మదింపు జరగాలన్నారు. ఆదరణ-3 కింద ఇచ్చే పనిముట్లు ఆధునికంగా, ఆయా కుల వృత్తులకు ఉపయోగకరంగా ఉండాలని సీఎం అన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సీఎం అన్నారు. మత్స్యకార వర్గాలు సీవీడ్ లాంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఈ వర్గాలపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణతోనే ఆయా వర్గాలు ఎక్కువ ఆదాయాన్ని పొందగలవని చెప్పారు. అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా... అందరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా... అధికార యంత్రాంగం చూడాలని, సంతృప్తి పరచాలని సీఎం సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి న్యాయ పరమైన ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలు బీసీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 64 కులాల కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని అధ్యయనం చేసేందుకు అన్ని వర్క్ షాపు నిర్వహించాలని సూచించారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్థుల్లో ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో కొందరు విద్యార్థులు సమీక్షా సమావేశానికి ముందు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించిన సీఎం చంద్రబాబు..ఉన్నత విద్యలో మరింత రాణించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతికి బాటలు

**-కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ**







**విజయవాడ(జి.కొండూరు),అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సమాజానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి, పురోభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాటలు వేస్తున్నాయని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కృష్ణాజిల్లా పామర్రు నియోజకవర్గానికి చెందిన టిడిపి కీలకనేత, తానా కార్యదర్శి మందలపు రవి రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్‌గా విజయవాడ భవానీపురం పున్నమి ఘాట్‌లోని హరిత రిసార్ట్‌లో సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ నేటి డిజిటల్‌యుగంలో యువత కొత్త టెక్నాలజీని అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. టెక్నాలజీని అన్వయించుకుంటూ,నేర్చుకుంటూ, నిపుణత సాధించటం ద్వారానే వాటి ఫలాలను అందుకోగలమన్నారు. అలా పౌరులంతా అందిపుచ్చుకుంటేనే సమాజాభివృద్ధికి తోడ్పాటు ను అందించినవారమవుతామన్నారు. రాబోయే కాలంలో ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నా యని వివరించారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖాధికారి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు ఎంతో సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయన్నారు. రాబోయేకాలంలో టెక్నాలజీ రంగంలో వచ్చే మార్పులను అన్వయించుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తుచేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింతగా పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీని ప్రజలకు అందుబాటులోకి తేవటం ద్వారా ఉపయోగించుకుంటూ సమాజ, పౌరసేవల్లో మరింత సృజనాత్మక పద్ధతులకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. టెక్నాలజీని నేర్చుకుంటేనే రాబోయేరోజుల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సాగునీటి పారుదల రంగంలో అధునాతన టెక్నాలజీని వాడేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్, ఎంఎల్‌సి బలిశెట్టి రాధాకృష్ణ, కైకలూరు, చింతలపూడి, ఏలూరు, పోలవరం, నరసాపురం, చిలకలూరిపేట, గోపాలపురం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, సొంగా రోషన్‌కుమార్, బడేటి రాధాకృష్ణ, సిరి బాలరాజు, నాయకర్ బమ్మిడి, ప్రత్తిపాటి పుల్లారావు, మద్దిపాటి వెంకటరాజు, ఆఫ్కాబ్ ఛైర్మన్ గన్ని ఆంజనేయులు, ఎపిఐఐసి ఛైర్మన్ రామరాజు, రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బోరగం శ్రీనివాసులు, పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తదితరులు పాల్గన్నారు. తొలుత మందలపు రవిని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు, ఎంపిలు, పలువు ప్రజాప్రతినిధులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు ఘనంగా సత్కరించారు.

**పదవికి వన్నె తెస్తా: మందలపు రవి..** నూతన బాధ్యతలు స్వీకరించిన మందలపు రవి మాట్లాడుతూ రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించటానికి, మెరుగైన పరిశోధనా ఫలితాలు రావటానికి తనవంతు కృషిచేస్తానన్నారు. కృత్రిమ మేధ, వేరబుల్, వర్చువల్ రియాల్టీ, త్రీడీ, రోబో, మెటావర్ తదితర సాంకేతికతల్లో పైచేయి సాధించాల్సివుందన్నారు. కాలుష్యకారక ఇంధనాలకు స్వస్తి పలికి.. పునరుత్పాదక, హరిత ఇంధనాలపై దృష్టి సారించాలన్నారు. స్వయం చోదక వాహనాలకు మార్గం సుగమం చేసుకోవాలనీ, తక్కువ ఖర్చుతో నాణ్యమైన నిర్మాణ సాంకేతికతలను అభివృద్ధి చేసుకోవాలనీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) సాయంతో ఇళ్లు, కార్యాలయాలు, కార్లు, నగరాల్లోని డిజిటల్ సాధనాలతో అనుసంధానం పెంచుకోవాల్సివుందని వివరించారు. వాతావరణ మార్పులను అధిగమించే పరిజ్ఞానాలు, పర్యావరణహిత విధానాలను ఆచరణలో పెట్టాలనీ, అంతరిక్ష పరిశోధనలు పెంచుకోవాల్సివుందని గుర్తుచేశారు. రోగ నిర్ధారణ, చికిత్సల్లో రోబోటిక్-నానో సాంకేతికత వినియోగాన్ని పెంచాల్సివుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్ చాలా వేగం, ఖచ్చితత్వంతో కూడిన ప్రక్రియని, ఇది మన రాజధాని అమరావతిలో ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశేషంగా కృషిచేస్తున్నార ని వెల్లడించారు. సమీప భవిష్యత్తులో ఊహించలేనంత వేగంగా జనజీవితంలోకి ఈ టెక్నాలజీ వచ్చేస్తుందన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు అభినందనలు తెలిపారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి రేగుళ్ల మల్లికార్జునరావు, ఎడి పెంచలయ్య తదితరులు ఘనంగా అతిథులకు స్వాగతం పలికారు.

# పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టండి

## ట్రాఫిగురా సీఈవో సచిన్ గుప్తాతో మంత్రి నారా లోకేష్ భేటీ!





**ముంబయి,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** లాజిస్టిక్స్, చమురు, ఖనిజాలు, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో పేరెన్నికగన్న ట్రాఫిగురా ఇండియా సీఈవో సచిన్ గుప్తాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబయిలో భేటీ అయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో $243.2 బిలియన్ డాలర్ల వ్యాపార కార్యకలాపాలు నిర్వహించిన ట్రాఫిగురా... ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ తో $1.4 బిలియన్ డాలర్ల విలువైన ఎల్ఎన్‌జీ సరఫరా ఒప్పందం చేసుకుంది. విశాఖపట్నం పోర్టు నుంచి బొగ్గు, జింక్, అల్యూమినియం వంటి వస్తువులను ఎగుమతి చేస్తోంది. ట్రాఫిగురా సంస్థ ఆయిల్, పెట్రోలియం ఉత్పత్తుల రవాణా, మెటల్, మినరల్స్, బల్క్ కమాడిటీస్ రవాణా, గ్యాస్, పవర్, రెన్యువబుల్ ఎనర్జీ, షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ట్రాఫిగురా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో కోల్డ్ స్టోరేజి, ఎగుమతి మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ ఆహ్వానించారు. భారత్ లో ఏపీ ప్రధాన బియ్యం ఉత్పత్తిదారు మాత్రమే కాకుండా, దేశంమొత్తం మీద 70శాతం రొయ్యలు ఏపీలోనే ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో సరుకు నిల్వలకు అధునాతన వేర్ హౌసింగ్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయండి. పునరుత్పాదక ఇంధన రంగంలో దూసుకుపోతున్న ఏపీలో విద్యుత్ వాణిజ్యంలో భాగస్వామ్యం వహించండి. కాకినాడ లేదా విశాఖపట్నంలో ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినల్‌ను ఏర్పాటుచేసి గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి సహకారం అందించండి. విశాఖపట్నం పోర్టు నుంచి ఈ ఏడాది 82.62 మిలియన్ టన్నుల సరుకు రవాణా నమోదైన నేపథ్యంలో... విశాఖలో కమోడిటీ ట్రేడింగ్ డెస్క్ ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

# బిహార్ ఎన్నికల షెడ్యూల్ విడుదల..

**న్యూఢిల్లీ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి దశలో నవంబర్ 6న, రెండో దశలో నవంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. 14 న ఓట్ల లెక్కింపు జరగనుంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ "ఎన్నికల ప్రక్రియను మరింత సులభతం చేస్తున్నాం. నామినేషన్లకు 10 రోజుల ముందు కూడా ఓటరు జాబితాలో మార్పులు చేసుకోవచ్చు. రాష్ట్రంలో 14 లక్షల మంది కొత్త ఓటర్లు వచ్చారు. 90,712 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 100 శాతం వెబ్‌కాస్టింగ్ జరగనుంది. మొత్తం 7.43 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 3.92 కోట్లు, స్త్రీలు 3.5 కోట్లు. 243 స్థానాల్లో ఎస్సీ స్థానాలకు 38, ఎస్టీ స్థానాలు 2 సీట్లు కేటాయించాం. వందేళ్లకు పైబడిన ఓటర్లు 14 వేల మంది ఉన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. బిహార్ ఎన్నికల నుంచి కొత్తగా 17 రకాల సంస్కరణలు తీసుకొస్తున్నాం. ప్రతి పోలింగ్ బూత్‌లో 1200లకు మించి ఉండరాదు. ఇకనుంచి ఈవీఎంలలో అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయి.

# అక్టోబర్ 07 న రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- కర్నూలులో రాష్ట్రస్థాయి జయంత్యోత్సవం
- తరలిరానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు



**అమరావతి,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** నేడు (07 అక్టోబర్) మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది నుంచి మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అక్టోబర్ ఏడో తేదీన మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయింతిని నిర్వహించనున్నామన్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంత్యోత్సవాన్ని చేపట్టనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్‌కు అప్పట్లో భారీ సంఖ్యలో వినతులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రాముఖ్యతనిస్తూ, ఇచ్చిన హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని నిర్ణయం తీసుకుందని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.


HIRING: Doctors (Dermatology / Trichology) – Vizag

Hairfree & Hairgrow Clinic
CLINIC
Visakhapantam

| | |
|---|---|
| Position | Doctor (Skin & Hair Treatments) |
| Qualification | BHMS / BAMS, BDS |
| Experience | Freshers / Experienced |
| Skills | Skin & Hair Consultation, Procedures, |
| | Treatments |
| Language | Teluu Communication is essential |
| Preferance | Immediate Joiners and Local Candidates |

Clinic Address:
1st Floor, Satyam Plaza, Dwaraka Nagar, Vizag
Email: hr.hffhg001(gmail.com | Phone: 72620 05001

Take the next step in your Hair & Skin Care career!


# ఏకగ్రీవాలు ప్రజాస్వామ్య సూచికలు కాదు

**-ప్రముఖ పత్రిక సంపాదకులు సతీష్ చందర్**




**విజయవాడ లీగల్, అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ది బెజవాడ బార్ అసోసియేషన్ లో డాక్టర్ అంబేద్కర్ బాంబే లెజిస్లేటివ్ కౌన్సిల్లో చేసిన చారిత్రాత్మకమైన ఉపన్యాసం ఆధారంగా మన పల్లెల తీరు పట్ల అంబేద్కర్ కి ఉన్న అభ్యంతరాల మీద ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్ చే బెజవాడ బార్ అధ్యక్షులు ఎ కె బాష ఆధ్వర్యంలో సెమినార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నిర్వహణ సభ్యులు అయిన న్యాయవాది బోడపాటి సుధీర్ కుమార్ స్వతంత్రం రాకముందు గ్రామీణ వ్యవస్థ భారత దేశ పరిస్థితుల గురించి వివరించి ఈ ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదనంతరం వి సుధాకర్ ఎక్స్ జనరల్ సెక్రెటరీ తణుకు న్యాయవాది అయిన సురేష్, సతీష్ చంద్ర ని సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ చందర్ మాట్లాడుతూ లిఏకగ్రీవాలు ప్రజాస్వామ్య సూచికలు కావు అంటూ గ్రామ పంచాయితీలలో ఏకగ్రీవాలనేవి అన్ని సందర్భాల్లోనూ ప్రజాస్వామ్యానికి సూచికలు కావని, ప్రముఖ పత్రికా సంపాదకులు, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా సభ్యులు సతీష్ చందర్ అన్నారు. ఏ భూస్వామో, సంపన్నుడో ఆశచూపో, భయ పెట్టో ప్రత్యర్థులను రంగం నుంచి తప్పించే ఏకగ్రీవాలే అధికంగా వుంటున్నాయని ఆయన అన్నారు. ఇలాంటి ప్రమాదాలు వుంటాయని సరిగ్గా 97 యేళ్ళ క్రితం ఇదే రోజు (అక్టోబరు6, 1932)న బాంబే లెజిస్లేటివ్ అసెంబ్లీ లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పంచాయితీ రాజ్ బిల్లు మీద మాట్లాడుతూ ఈ ప్రమాదాన్ని పరోక్షంగా హెచ్చరించారని ఆయన గుర్తుచేశారు. బెజవాడ్ బార్ అసోసియేషన్ లో సతీష్ ఛందర్ 'భారత రాజ్యాంగం వెర్సస్ భారతీ-య గ్రామం అనే అంశం మీద ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గవర్నింగ్ బాడీ మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. వైస్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీ స్వామి అయ్యప్ప జ్యోతి పీఠంకు పోటెత్తిన అయ్యప్ప భక్తులు



**విస్సన్నపేట,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో సత్తుపల్లి రోడ్డు లోని శ్రీ స్వామి అయ్యప్ప జ్యోతి పీఠం గృహప్రవేశానికి మండలంలోని అయ్యప్పలు పోటెత్తారు. మంగళ వాయిద్యాల మధ్య గోమాత సమేతంగా శాస్త్రోక్తంగా అయ్యప్పలు గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వస్తిశ్రీ చంద్రమనేన శ్రీ విశ్వా వసు నామ సంవత్సర ఆశ్వీయుజ మాస శుద్ధ చతుర్దశి అనగా అక్టోబర్ ఆరవ తేదీ సోమవారం ఉదయం 9 గంటల 26 నిమిషాలకు ఉత్తరాభాద్ర నక్షత్ర యొక్క వృశ్చిక లగ్న పుష్కరాంశము నందు దైవజ్ఞులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో గృహప్రవేశం చేయటం జరిగింది అని అయ్యప్పలు తెలియజేశారు. అయ్యప్ప స్వామి పీఠం నందు స్వామివారికి పూజ అభిషేకం హెూమం వ్రతం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పెద్ద ప్రసాదాలు, అన్న ప్రసాదం అందించారు.

## వైసీపీ కార్యకర్తల కోసంమే జగనన్న డిజిటల్ బుక్



**రౌతులపూడి,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ప్రత్తిపాడు వైసీపీ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరి ఆదేశాల మేరకు రౌతులపూడి మండల కేంద్రంలో వైసీపీ మండల కన్వీనర్ చింతకాయల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయా గ్రామ కార్యకర్తల సమక్షంలో వైసీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి జమీలు, వాసిరెడ్డి భాస్కర్ బాబు, జెడ్పిటిసి గుళ్ళు చిన్న దివాన్, గొల్లి రమణ, సోమరౌతు రాజా, శరణం శ్రీను, నల్లమిల్లి ఎర్రాబత్తుడు ,మాజీ జెడ్పిటిసి సత్తిబాబు ఆయా గ్రామ అభిమానులతో కార్యకర్తల సమక్షంలో డిజిటల్ క్యాలెండర్ ప్రారంభించారు. గ్రామాలలో ఏకార్యకర్తకి ఇబ్బంది వచ్చినా ఈ డిజిటల్ బుక్ సంబంధించినటువంటి క్యాలెండర్ పై క్యూ ఆర్ కోడ్ తో మీ మొబైల్ లోనే మీ సమస్యలను మొబైల్ ద్వారా సమాచారం ఇవ్వాల్సిందిగా వారు కోరారు. లేదా 090 9971 78 నెంబర్ కి కాల్ చేసి మీ సమస్యను ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు.

## నందిగామలో కోటి ఏడు లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పెడన మండలం నందిగామ గ్రామంలో కోటి ఏడు లక్షల రూపాయల విలువ గల అభివృద్ధి పనులను శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం నాడు ప్రారంభించారు 44 లక్షల రూపాయలతో సచివాలయ భవన నిర్మాణం 24 లక్షల రూపాయలతో ఆర్బికే భవనం 21 లక్షలతో సెంటర్ 15 లక్షల రూపాయలతో జిల్లా పరిషత్ హై స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం నాలుగు లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నగేష్ శ్రీరాం ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నగేష్ టీడీపీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్ సర్పంచి బొడ్డు చినబాబు ఉప సర్పంచ్ కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు నందిగామ పిఏసిఎస్ అధ్యక్షులు యరగని నాగరాజు కొంకేపూడి పిఏసిఎస్ అధ్యక్షుడు కట్టా నాగరాజు స్థానిక టిడిపి నాయకులు పామర్తి వెంకటేశ్వరావు అనగాని అంకాలరావు యరగని వీరరాఘవులు ఎంపీడీఓ అరుణ తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్ పంచాయతీ కార్యదర్శి వార్త అనురాధ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇలా ఉండగా గ్రామంలో రెండు గ్రూపులుగా ఏర్పడి శాసనసభ్యునికి స్వాగతం ఫ్లెక్సీ లను ఏర్పాటు చేయడం విశేషం.

## విద్యా సామాజిక సేవా రంగా ల లో కీలకపాత్ర పోషిస్తున్న డెమోక్రటిక్ పిఆర్టియు...




**విజయవాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** విద్యా సామాజిక సేవా రంగా లలో డెమొక్రటిక్ పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం కీలక పాత్ర పోషిస్తుందని ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యల పరిష్కారానికి డెమొక్రటిక్ పి.ఆర్.టి ల.యు సంఘ పక్షాన ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి విద్యా ప్రమాణాల అభివృద్ధికి జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ ద్వారా ఎన్నో బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాది మంది ఉపాధ్యాయ అభిమానుల సహకారం తో బలమైన సంఘం గా రూపు దిద్దు కున్నదని ఉపాధ్యాయుల ఆకాంక్షల మేరకు చిత్త శుద్ధి తో పనిచేస్తున్నామని డెమొక్రటిక్ పిఆర్టియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీను అన్నారు.ఈ రోజు డెమొక్రటిక్ పిఆర్టియు మచిలీపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు డి శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిల చెల్లింపులు త్వరితగతీన జరపాలని టెట్ కు సంబంధించిన పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని ఖాళీగా ఉన్న సబ్జెక్టు పోస్టులకు గజిటెడ్ ప్రధానోపాధ్యాయ పోస్టులకు పదోన్నతులు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా శాఖ అధ్యక్షులు జీవీఎస్,.పెరుమాళ్ డెమొక్రటిక్ పి ఆర్ టి యు నాయకులు పులిగడ్డ వెంకటేశ్వరరావు సుధాకర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

## డిసెంబర్ నెలాఖరుకు అక్రిడిటేషన్స్ ఇవ్వకపోతే న్యాయపోరాటం

### -ఏపిఎంఎఫ్ ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి




**విజయవాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** డిసెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రంలో జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ పూర్తి చేయకపోతే న్యాయపోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపిఎంఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఢిల్లీబాబురెడ్డి హెచ్చరించారు. ఏపిఎంఎఫ్ రాష్ట్ర కార్యవర్గం మరియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఆదివారం నాడు విజయవాడ పటమటలోని ఏపిఎంఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఫెడరేషన్ సమన్వయకర్త బి. సతీష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఉండేవని, వైసీపీ హయాంలో అక్రిడిటేషన్లను 9 వేల మందికే ఇచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పని చేసే జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తయినా వైసీపీ హయాంలో ఇచ్చిన అక్రిడిటేషన్లనే రెన్యూవల్ చేస్తున్నారే తప్ప కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఏపిఎంఎఫ్ ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు చేపట్టామని, 2026 జనవరి నెలాఖరు వరకు సభ్యత్వ నమోదు పూర్తి చేసి ఏపిఎంఎఫ్ సభ్యులందరికి గ్రూప్ ఇన్సూరెన్స్ చేయిస్తామని ప్రకటించారు. జిల్లాల వారీగా ఏపిఎంఎఫ్ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు ఢిల్లీబాబు రెడ్డి తెలిపారు. ఏపిఎంఎఫ్ కు అనుబంధంగా చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం పని చేస్తుందని, త్వరలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఢిల్లీబాబు రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో పని చేసే ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ ఇవ్వాలని, జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యం పెంచేందుకు శిక్షణా తరగతులు అవసరం అని, అయితే ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా కొన్ని యూనియన్ల సభ్యులకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై ప్రభుత్వానికి ఏపిఎంఎఫ్ తరపున ఫిర్యాదు చేయనున్నట్లు ఢిల్లీబాబు రెడ్డి తెలిపారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ మాజీ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత మన రాష్ట్రంలోని జర్నలిస్టుల కోసం ఆవిర్భవించిన ఏపిఎంఎఫ్ ను బలోపేతం చేసుకోవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. పలు రాష్ట్రాల్లో బలమైన జర్నలిస్టు యూనియన్లు ఏపిఎంఎఫ్ తో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, త్వరలో ఆయా రాష్ట్రాల యూనియన్లతో చర్చించి జాతీయ స్థాయి యూనియన్ ఒకటి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏపిఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షునిగా చొల్లంగి అప్పాజీ (బి.ఆర్.కె న్యూస్ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్), రాష్ట్ర కార్యదర్శులుగా సత్య (టీవీ 9 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), డోలా అప్పన్న (శ్రీకాకుళం), సురేందర్ రెడ్డి(తిరుపతి), సోమశేఖర్ (చిత్తూరు), డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులుగా కాకర సుధీర్ (ఏబిపి దేశం ఉమ్మడి తూర్పుగోదావరి), విశాఖపట్నం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పి. శంకరరావులను నియమిస్తున్నట్లు ఏపిఎంఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి ప్రకటించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ (విశాఖపట్నం), మల్లికార్జున్ (నెల్లూరు), బాలాజీ యాదవ్ (చిత్తూరు), ఉదయ్ భాస్కర్(ఏలూరు), కాకర సుధీర్ (అంబేద్కర్ కోనసీమ), రాష్ట్ర కార్యదర్శి డోలా అప్పన్న, బాపట్ల ప్రతినిధి వైఎస్ రావు తదితరులు ప్రసంగించారు.

## పదవులు ఆయనకు అలంకారం కాదు

# పదవులకే ఆయన అలంకారం

### -ఆయనే స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మద్ది రెడ్డి (సూరి రెడ్డి )



**విస్సన్నపేట,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పుట్రేల గ్రామ సర్పంచ్ చేసిన జడ్పిటిసి సభ్యునిగా సేవలందించిన మండల వైసీపీ అధ్యక్షుడు గాను తిరువూరు ఏఎంసీ చైర్మన్ గాను స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ మెంబర్ గా ఏ పదవి ఆయన చేపట్టిన మండలంలో ఒక గ్రామం సర్పంచ్ కావాలన్నా మండల ప్రజా పరిషత్ సింహాసనంపై ఎంపీపీగా ఒకరిని కూర్చోబెట్టాలన్న దిశా నిర్దేశకుడు రాజకీయ సాగరానికి దిక్సూచి వంటి రాజకీయ చాణిక్యుడు ఆయనకు పదవులు అలంకారం కాదని పదవులకే ఆయన అలంకారమని చెప్పే వన్ అండ్ ఓన్లీ మెగా లీడర్ మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి అలియాస్ సూరి రెడ్డి అని అంటే ఎలాంటి అతిశయోక్తి లేదని సర్వత్రా అంటున్నారు. పుట్రేల జిల్లా పరిషత్ హై స్కూల్ డైనింగ్ రూమ్ ఏర్పాటు, గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ సొంత నిధులతో స్థలము కొని భవనం ఏర్పాట, కరోనా సమయంలో మండలంలో ఐదు ట్యాంకర్లు రక్షిత నీటి సరఫరాకు పలు గ్రామాలలో ఉదారతగా అందించుట వీటన్నిటిని మించి ,బడులు, గుడులు మసీదులు, చర్చిల అభివృద్ధికి ఆర్థిక వెన్ను దన్ను వీటితోపాటు పుట్రెల శివాలయం నిర్మాణంలో ప్రముఖ భూమిక, విద్యా వైద్య రంగాలలో ఆర్థిక చేయూత సుదీర్ఘకాలంగా అందిస్తున్న వ్యక్తి మద్ది రెడ్డి కావటం ఎన్టీఆర్ జిల్లాలోని విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామవాసి కావడం అందరికీ గర్వకారణం అని పరిసర ప్రాంతవాసులు అనుకుంటున్నారు. సాయం సంధ్యా సమయంలో చల్లని వాతావరణంలో ఒక తేనేటి విందు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉందిలే మంచి కాలం ముందు ముందున అని రాబోయేవన్ని మంచి రోజులేనని అన్నీ మంచి శకునాలే అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తధ్యమన్నారు. ఏ ఎన్నిక జరిగిన ఎవరికి ఓటు వేయాలో ప్రజలకు తెలుసు అన్నారు. నేటి యువత రాజకీయాలలో విప్లవాత్మకమైన అడుగులు వేస్తున్నారని సోషల్ మీడియా అస్త్రంగా వాట్సాప్ ఫేస్బుక్ ట్విట్టర్ ఇంస్టాగ్రామ్ టెలిగ్రామ్ తదితర మాధ్యమాలలో రవి కాంచని చోట కవి కాంచును అన్న చందంగా మారుమూల ప్రాంతాలలో జరిగే సమాచారాన్ని కూడా రాత్రి పగలు అనే తేడా లేకుండా యాక్టివ్ గా పోస్ట్ చేస్తున్నారన్నారు. తండ్రిని మించిన తనయుడుగా దివంగత జననేత వైయస్ రాజశేఖర రెడ్డి తనయుడు వైయస్ జగన్మోహన రెడ్డి చరిత్రలో సువర్ణాక్షరాలతో లెక్కించబడే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా సువర్ణ పాలన అందించి చరిత్ర సృష్టించారన్నారు. నవరత్న పథకాల ద్వారా జన రంజక పాలన ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన రెడ్డి అందించారని గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ వాలంటీర్ల అనుసంధానంతో వికలాంగ వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళ చేనేత గీత దప్పు కళాకారులు హెచ్ఐవి బాధితులు తల సేమియా వ్యాధిగ్రస్తులు పక్షవాత పీడితులు కిడ్నీ రోగ పీడితులు తదితరాల వారికి వర్షాకాలం శీతాకాలం అనే తారతమ్యంతో పని లేకుండా ప్రతినెల 1వ తేదీన సూర్యోదయానికి ముందే తలుపు తట్టి మరీ పింఛన్ పిన్ని బాబాయ్ తాత అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామ వాలంటీర్లు అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది అని ఆయన గుర్తు చేశారు. నాడు ఏలూరు సిద్ధం సభలో వైయస్ జగన్మోహన రెడ్డి సూపర్ సిక్స్ పథకాలను అందించడం కష్టమని చెప్పారని రాబోయే ఎన్నికలలో గెలుపు ఎవరిదో కాలం నిర్ణయిస్తుందన్నారు. రాజకీయ పార్టీ పరంగా మండల స్థాయిలో ఏ మార్పు జరగాలన్న జిల్లా అధ్యక్షుడు ఆదేశాలతో మండల స్థాయిలో పథక రచన జరుగుతుందన్నారు. వైసిపి ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని ప్రజాక్షేత్రంలో రాబోయే కాలంలో ఓటరు దేవుళ్ళు తమ ఓటు అనే వజ్రాయుధం సాక్షిగా నిరూపణ అవుతుంది అని తెలియజేశారు.

## గీతా గోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ తంగేళ్ల వెంకట కిషోర్ యాదవ్ సంతాప సభ



**తిరుపతి,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పట్టణంలో ప్రముఖ స్విమ్స్ ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్గా ప్రతిష్టాత్మకంగా సేవలందించిన డాక్టర్ తంగేళ్ల వెంకట కిషోర్ యాదవ్ (వయస్సు 42 సంవత్సరాలు) గత నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారని, ఈ ప్రమాదంలోనే ఆయన కుమార్తె అశ్వినీ నందన (వయస్సు 7 సంవత్సరాలు) కూడా ప్రాణాలు కోల్పోవడం చాలా దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి మరణం వైద్య వృత్తి, విద్యావేత్తల వర్గం, స్నేహితులు మరియు స్థానిక పౌరుల మధ్య తీవ్ర విషాదాన్ని కలిగించింది. వారి స్మరణార్థం గీతా గోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో తిరుపతి పట్టణంలోని స్థానిక యూత్ హాస్టల్ నందు సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో డాక్టర్ కిషోర్ యాదవ్ సేవాస్ఫూర్తి, వైద్య వృత్తి పట్ల నిబద్ధత, కుటుంబపరమైన దృఢమైన బాధ్యతలను స్మరించుకొని ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తిరుపతి కార్పొరేటర్ మరియు వైద్యురాలు అన్నా సంధ్య భర్తగా, బీసీ నాయకుడు అన్నా రామచంద్రయ్య అల్లుడిగా ఉన్న డాక్టర్ కిషోర్ యాదవ్ మరణం కుటుంబానికీ, సమాజానికీ భారీ నష్టం అని పేర్కొన్నారు. రామచంద్రయ్య కుటుంబం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉన్న నేపథ్యంలో ఈ విషాద ఘటన జరగడం తీవ్ర విచారకరం అని, ఆయన కుటుంబానికి ధైర్యం ప్రసాదించాలని దేవుని ప్రార్థించారు. ఈ సంతాప సభలో గీతా గోవిందం సేవా సమితి సభ్యులు, బీసీ సంఘం నాయకులు, మరియు పలువురు ప్రఖ్యాత వ్యక్తులు ప్రొఫెసర్ శ్రీనివాసులు యాదవ్, ఇంజనీర్ దామోదరం యాదవ్, రిటైర్డ్ సీ.టి.ఓ. బాల గుర్రప్ప యాదవ్, బట్ట భాస్కర్ యాదవ్, గోపాల్, మధుసూదన్ యాదవ్, ఉమాపతి యాదవ్, కాకులూరు గుణశేఖర్ యాదవ్, రామచంద్రయ్య యాదవ్, జయరామయ్య యాదవ్, మునీంద్ర యాదవ్ అలాగే సహెూద్యోగులు, స్నేహితులు, స్థానిక పౌరులు, విద్యార్థులు పాల్గొని, కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## ఉత్తమ సేవలకు దక్కిన గౌరవ పురస్కారం

- "జై ఉపాధ్యాయ పురస్కార్" అవార్డు అందుకున్న లైన్ డా.ఎస్.లిల్లెమ్మ
- లిల్లెమ్మ కు అవార్డు అందజేసిన లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్ ఆంజనేయులు





**మైలవరం,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయురాలుగా ఉత్తమ సేవలు అందించిన డా.ఎస్.లిల్లెమ్మ కు గౌరవ పురస్కారం లభించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ ఆదివారం పోరంకిలోని చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లైన్స్ సేవా భవన్ లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లైన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు (డిస్ట్రిక్ట్.316D.2025-26)చేతులు మీదుగా లైన్ డా.ఎస్. లిల్లెమ్మ "జై ఉపాధ్యాయ పురస్కార్" అవార్డు అందుకున్నారు.ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయురాలు లైన్ డా.ఎస్. లిల్లెమ్మ అందించిన ఉత్తమ సేవలకు గాను ఈ అరుదైన గౌరవ పురస్కార్ అవార్డుతో సత్కరించడం జరిగిందని డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు వెల్లడించారు. తాను అందించిన సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వారు "జై ఉపాధ్యాయ పురస్కార్"అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని లిల్లెమ్మ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లైన్ ఎన్.వి.వి.ఎస్.వి ప్రసాద్,సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లైన్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, విజయవా డలోని వివిధ లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లు, తదితరు లు పాల్గొన్నారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో గూడూరు లో నేను సైతం



**పెడన,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం యాదవ సంఘం ఆధ్వర్యంలో పేద వృద్దులకు ఆర్థిక సాయం తో పాటునెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. గూడూరు మండలం చిట్టిగూడూరు గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలకు సుమారు 50 వేల రూపాయలు విలువ చేసే సాయాన్ని అందించారు. యాదవ సంఘం ప్రతినిధులు ఇందుకు సహాయ సహకారాలు అందజేశారు సంగం ఏర్పడిన తర్వాత బంటుమిల్లి కృత్తివెన్ను పెడన మండలాల తో పాటు గూడూరు మండలంలో కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు కొలుసు చందు తెలిపారు..తొలుత యాదవ సంఘ ప్రతినిధులు గూడూరు ద్వారకా నగర్ లోని రామాలయం వద్ద వీర్ల కృష్ణా యాదవ్ ఆధ్వర్యంలో సమావేశామయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు పుట్టి కృష్ణ ప్రసాద్ వీర్ల కృష్ణ యాదవ్ కొలుసు చందు బోయిన నాగరాజు మోహన్ దండుబోయిన గణేష్ పిల్లంగోళ్ళ వెంకట స్వామి తదితరులు మాట్లాడుతూ సంఘాన్ని మరింత పటిష్ట పరిచి నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఇందు కోసం గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పల్లపోతు అంకరాజు



పోరంకిలోని చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లైన్స్ సేవా భవన్ లో ఈ నెల 5వ తేదీ ఆదివారం "జై ఉపాధ్యాయ పురస్కార్" అవార్డు అందుకున్న లైన్ డా.ఎస్.లిల్లెమ్మ తిరుగు ప్రయాణంలో ఆమె తన సామాజిక సేవకార్యక్రమంలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న కడువృద్ధురాలికి అరటి పండ్లు, ఆహారం అందజేశారు.మానవసేవే.... .మాధవ సేవ అనే సిద్ధాంతంతో మదర్ థెరిస్సా స్ఫూర్తితో తాను సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ తెలుగు టీచర్,లైన్ డా. ఎస్. లిల్లెమ్మ పేర్కొన్నారు.

-మైలవరం,అక్టోబరు 6 (వార్తాప్రభ) :

## టి.ఎన్.టి.యు.సి.నేత గరిమెళ్ళ చిన్న ఆధ్వర్యంలో టిడిపి నేతలకు పాలాభిషేకం




**విజయవాడ సెంట్రల్,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం, పాయకపురం వద్ద గల మదర్ ఇండియా ఆటో స్టాండ్ వద్ద, సెంట్రల్ నియోజకవర్గం టి.ఎన్.టి.యు.సి. అధ్యక్షులు గరిమెళ్ల చిన్నా ఆధ్వర్యంలో ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు, ఆటో కార్మికులకు, 15,000 రూపాయలను, ఆటో డ్రైవర్స్ సేవలో కార్యక్రమం లో భాగంగా ఆటో వారి బ్యాంకు అకౌంట్స్ లో వేసినందుకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నాయుడుకి,ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ కి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కి,సెంట్రల్ నియోజకవర్గ.శాసనసభ్యులు బొండా ఉమ మహేశ్వరరావు లకు ఆటో కార్మికులు పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గం టి.ఎన్.టి.యు.సి అధ్యక్షులు గరిమెళ్ల చిన్నా మాట్లాడుతూ నారా చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం, ఆటో డ్రైవర్స్ కి 15,000రూపాయలు అకౌంట్స్ లో వేయడం ఆనందంగా వుందన్నారు.ఆ డబ్బులు, ఆటో మైంటెన్స్ కి ఉపయోగ పడతాయని చెప్పడం జరిగింది. ఇదే కాకుండా, ఆటో డ్రైవర్స్ సేవలో భాగంగా, ఉండవల్లి నుంచి, సింగ్ నగర్ స్టేడియం వరకు, ఆటోలలో వచ్చి, ఆటో కార్మికుల జీవితాలను అవగతం చేసుకున్న, నారా చంద్రబాబు నాయుడు కి, కొణిదల పవన్ కళ్యాణ్ కి, నారా లోకేష్ కి, పి, మాధవ్, కి కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది. అలాగే కార్మికుడికి ఏ కష్టం వచ్చిన ముందు వుండే నాయకుడు బొండా ఉమ మహేశ్వరరావు అని అన్నారు.మొన్న, జీ, ఓ నెంబర్ 8ని రద్దు చేయించిన, మరియు జీ ఓ నెంబర్ 21,జీ ఓ నెంబర్ 31లని రద్దు చేయాలని అసెంబ్లీ లో బొండా ఉమ గళ మెత్తి, మాట్లాడిన ఏకైక నాయకుడు, బొండా ఉమ అన్నారు. ఇక్కడ సెంట్రల్ నియోజకవర్గం లో అన్ని వర్గాలను కార్మికులను, కంటికి రెప్పలా కాపాడుకుంటున్న, నాయకుడు బొండా ఉమ మహేశ్వరరావు అని కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమం లో సెంట్రల్ నియోజకవర్గ టి.ఎన్.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి కరణం సుబ్రహ్మణ్యం, ముని అప్పలస్వామి, రంగ, కోటేశ్వరరావు, శివయ్య, నీలం మధు, వెంకటకృష్ణ,సాయి, వెంకట్, రవణమ్మ, లలిత, అశోక్, సురేంద్ర, తిరుమలరావు, హరీష్, రాజు,లీలా, హనుమంతు,అప్పారావు,మహ్మద్, త్రినాధ్,రమణ తదితర ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనసుతో ఇందిరమ్మ క్యాంటీన్ లో అల్పాహారం

### శాసనసభ్యులు అరికెపూడి గాంధీ





**శేరిలింగంపల్లి,అక్టోబర్ 6 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టెలికాం నగర్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ లో 5.రూపాయలకే ఆల్పాహారం పథకం ను జోనల్ కమిషనర్ హేమంత్ బొర?డే,డి.సి ప్రశాంతి,ఏ.ఎం.ఓ.హెచ్ శ్రీకాంత్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఇందిరమ్మ క్యాంటీన్లలో నేటి తో రుచికరమైన టిఫిన్ కూడా అందుబాటులోకి రానుంది అని, పేదవాడు ఉదయం పూట అర్ధ ఆకలి తో ఉండకూడదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో ఆల్పాహారం పథకం ప్రవేశపెట్టడం జరిగినది.ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఇడ్లీ,పూరీ,వడ,ఉప్మా,పొంగల్ వంటి టిఫిన్లను ప్రజలకు అందించనున్నారు అని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి అని,ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి ఉదయం పూట ఆల్పాహారం,మధ్యాహ్నం భోజనం కేవలం 5 రూపాయలకే చక్కటి రుచికరమైన టిఫిన్ మరియు బోజనం అందిస్తుంది అని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ చక్కటి అవకాశం ను చుట్టుపక్కల పరిసర ప్రాంత వాసులు,ప్రయాణికులు,వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.పేదలు ఆకలితో అలమటించొద్దనే ఏకైక ఉద్దేశంతో నగరంలో రాష్ట్ర ప్రభుత్వం మరి కొన్ని ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేశారని. రోజు భోజనాలను ఈ క్యాంటీన్ల ద్వారా పేదలు ఆకలి తీరుస్తాయి అని వీటిని సద్వినియోగ పర్చుకోవలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఈఈ శిరీష, నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ,కార్యకర్తలు, కాలనీల వాసులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రిషి యాదవ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే





**కూకట్ పల్లి,అక్టోబర్6(వార్తాప్రభ):** యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రిషి యాదవ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం కూకట్ పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు,స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి నీ కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్ రవీందర్ రెడ్డి రిషి యాదవ్ ను ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ బి.సి.యువ నేత రిషి యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

# "రాయదుర్గంలో రికార్డు స్థాయిలో భూమి వేలం.

### 7.67 ఎకరాలకు ఎకరానికి ?177 కోట్లు, మొత్తం రూ. 1357.59 కోట్లు.

### అన్ని చారిత్రాత్మక రికార్డులను బద్దలు కొట్టింది"

**హైదరాబాద్, అక్టోబర్ 6:(వార్తా ప్రభ ప్రతినిధి):**తెలంగాణ ప్రభుత్వం/తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ, హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని రాయదుర్గంలో జరిగిన 7.67 ఎకరాల తాజా వేలంలో ఎకరానికి ?177 కోట్ల రికార్డును సాధించింది, ఇది తెలంగాణలో భూమి విలువకు కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. ఇది రాష్ట్రంలోని ఏ ప్రభుత్వం నేతృత్వంలోని వేలంలోనూ ఎకరానికి లభించిన అత్యధిక ధర, ఇది గతంలో హెచ్ఎండిఏ నిర్వహించిన వేలంలో 3.60 ఎకరాలకు ఎకరానికి ?100.75 కోట్లుగా ఉన్న నియోపోలిస్, కోకాపేట బెంచ్‌మార్క్‌ను అధిగమించింది.రాయదుర్గం వేలంలో ప్రముఖ జాతీయ మరియు ప్రాంతీయ డెవలపర్లు అసాధారణంగా పాల్గొన్నారు, హైదరాబాద్ యొక్క స్థిరమైన వృద్ధి, వేలం ప్రక్రియలో పారదర్శకత మరియు హైదరాబాద్ నాలెడ్జ్ సిటీకి గుండెకాయగా రాయదుర్గం యొక్క వ్యూహాత్మక విలువపై బలమైన పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రదర్శించారు. ఇది తెలంగాణ ప్రభుత్వం నుండి బలమైన విధాన మద్దతును కూడా నొక్కి చెబుతుంది. రాష్ట్రానికి గరిష్ట విలువ సాక్షాత్కారాన్ని అందించే పారదర్శక మరియు పోటీ బిడ్డింగ్ ప్రక్రియను నిర్ధారిస్తుంది.ఈ సందర్భంగా టిజిఐఐసి విసి %డ% మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక, ఐఎఎస్ మాట్లాడుతూ"రాయదుర్గం వేలం యొక్క అఖండ విజయం తెలంగాణకు గర్వకారణమైన క్షణం. ఎకరానికి ?177 కోట్ల రికార్డు ధర హైదరాబాద్ యొక్క దీర్ఘకాలిక సామర్థ్యం మరియు తెలంగాణ రైజింగ్-2047 కథపై పెట్టుబడిదారులు మరియు డెవలపర్లు కలిగి ఉన్న బలమైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరియు గౌరవనీయ పరిశ్రమలు %డ% వాణిజ్య మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు మద్దతుతో పారదర్శక, వ్యాపార అనుకూలమైన మరియు అధిక-వృద్ధి పర్యావరణ వ్యవస్థను సృష్టించాలనే రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతను ఇది పునరుద్ఘాటిస్తుంది.

# మైనారిటీ అధ్యక్షులు సర్దార్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

### ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ల హామీ



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 6, (వార్తాప్రభ) :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ మేరకు సోమవారం బోరబండ డివిజన్లోని ఎస్.ఆర్.టి నగర్ లో గల బిఆర్ఎస్ పార్టీ బోరబండ డివిజన్ మైనార్టీ అధ్యక్షులు, దివంగత నేత సర్దార్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ ఎల్పీ విప్, బోరబండ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పరామర్శించి ఇంటి నిర్మాణంలో భాగంగా మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బోరబండ డివిజన్లో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కొరకు పాటుపడిన సర్దార్ ఇంటి నిర్మాణం చేపడుతుంటే కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కక్షపూరితంగా వ్యవహరించి ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయించడంతో తీవ్ర మనోవేదనకు గురైన సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, సర్దార్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న బార్ అసోసియేషన్!!

● న్యాయవాదిపై దాడి అమానుషం ● న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి ● ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకం ● గోదావరిఖని బార్ అసోసియేషన్





**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 6 (వార్తాప్రభ ప్రతినిధి)** గోదావరిఖని న్యాయవాది గుల్ల రమేష్ పై దాడి అమానుషం అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ నిందితులపై కన్నెర్ర చేశారు గోదావరిఖని బార్ అసోసియేషన్ సభ్యులు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సంఘటన నేపథ్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.....ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకం అని అన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు ప్రతి నిత్యం ప్రజల పక్షాన పోరాడే న్యాయవాది పట్ల నిందితులు బీరు సీసాలతో దాడి చేయడం అమానుష చర్య అని ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించి, బెయిల్ కూడా రాకుండా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, సంయుక్త కార్యదర్శి కుమార్, ప్రదీప్ కుమార్, శంకర్, అమరేందర్ రావు, చక్రపాణి, శైలజ, అరుణ్ కుమార్, అవినాష్, సుజాత, రేష్మ, తిలక్, తదితరులు నిరసన ర్యాలీ చేపట్టారు.

# కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలకు నిదర్శనమే ఈ బాకీ కార్డ్ - ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 6, (వార్తాప్రభ) :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నయవంచనకు గురిచేస్తూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చేపట్టిన "బాకీ కార్డు" ఉద్యమంలో భాగంగా సోమవారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై "బాకీ కార్డు" ఆవశ్యకతను పార్టీ శ్రేణులకు వివరించారు. అనంతరం "బాకీ కార్డు"లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంటరీ ఇంచార్జ్ లు నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఆచరణకు సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు గ్యారంటీలను 700 రోజులైనా పూర్తి చేయకుండా మోసం చేసిన విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి, పాలన చేతకాక, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించలేక....బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను కట్టనీకే డబ్బులు లేవని, మాటిమాటికి బిఆర్ఎస్ పార్టీపై అప్పుల నెపాన్ని నెట్టివేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీకి రోడ్లు వేయడానికి, మూసీ సుందరీకరణ కు రేవంత్ సర్కార్ కి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలోని ఒక్కొక్క మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా 55 వేల రూపాయల బాకీ, వృద్ధులకు వృద్ధాప్య పింఛన్ల ద్వారా 44 వేల రూపాయల బాకీ, కళ్యాణ లక్ష్మి తులం బంగారం బాకీ, రైతు బంధు ద్వారా 76 వేల రూపాయల బాకీ, నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు బాకీ, రాష్ట్రంలోని యువతులకు స్కూటీల బాకీ ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మనకు ఉన్న బాకీలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనలోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, తెలంగాణ రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టేందుకు తెలంగాణ ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి రానున్న రోజుల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ వారి పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని, ఈ బాకీ కార్డు ఉద్యమం ప్రతి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత నాయకులు, ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుందాం

● కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్






**శేరిలింగంపల్లి, అక్టోబర్ 6 (వార్తాప్రభ)**:గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ చేశారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు,ప్రజాస్వామ్య పరిరక్షణకు నిదర్శనంగా దేశవ్యాప్తంగా "వోట్ చోరీ వ్యతిరేక కార్యక్రమం"ను కాంగ్రెస్ పార్టీ ఘనంగా నిర్వహిస్తోందని,అందులో భాగంగా తెలంగాణా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని,ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని, ప్రతి ఓటు పవిత్రమైనదని,ప్రజల హక్కులను హరించే ఓటు చోరీ వంటి చర్యలను అరికట్టాలని పిలుపునిచ్చారు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్.దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే ఓటు హక్కు కాపాడబడాలని,ప్రతి పౌరుడు తన ఓటును స్వేచ్ఛగా వినియోగించే హక్కు కలిగి ఉన్నాడని,ప్రజల్లో అవగాహన కల్పించే ర్యాలీలు,చర్చావేదికలు మరియు బహిరంగ సభల ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించలని,ప్రజల ఓటు విలువను మోసం చేసే ఏ చర్యకూ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, యువత,మహిళా నాయకులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముదిగొండలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు - సిఐ మురళి హెచ్చరిక.

**మధిర అక్టోబర్ 6 (వార్తాప్రభ)** ముదిగొండ మండలంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పెద్దమండవ, గంధసిరి, మున్నేరు ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సిఐ మురళి ఆదేశాల మేరకు సువర్ణాపురం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. సిఐ మురళి మాట్లాడుతూ, అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసే వారిని ఎలాంటి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ట్రాక్టర్ యజమానులు మరియు డ్రైవర్లు సరైన పత్రాలు, లైసెన్స్ లేకుండా రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారు వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం అని అన్నారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ రవాణా కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐ మురళి విజ్ఞప్తి చేశారు

వార్తా ప్రభ

హైదరాబాద్

# వైయస్సార్సీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మోహన్ రావు

### అభినందనలు తెలిపిన కూకట్ పల్లి యువజన నాయకులు



**కూకట్ పల్లి, అక్టోబర్6(వార్తాప్రభ):**వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన మోహన్ రావు నియమితులయ్యారు.పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం నుండి ఆదివారం ఉత్తర్వులు అందాయి. మోహన్ రావు వైఎస్ఆర్సిపి బలోపేతం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు.గన్నవరం నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి పార్టీ పటిష్టత కోసం బాగా పని చేశారు. ఈయన సేవలను గుర్తించి వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మోహన్ రావును నియమించారు.ఈయన నియామకంపై కూకట్ పల్లి కి చెందిన యువజన నాయకులు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు, నాయకులకుపార్టీ లో తగిన గుర్తింపు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకులు,రవితేజ,రాజు అభిరామ్,అనిల్,రిపోర్టర్ రాజు యాదవ్ అభినందనలు తెలిపారు.

# కోర్సులు... జీవనోపాధికి కోర్సులు!!

### ఉపాధి కల్పనకై సింగరేణి బంపర్ ఆఫర్

**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 6 (వార్తాప్రభ ప్రతినిధి)**ఉపాధి కల్పనకై సింగరేణి బంపర్ ఆఫర్ ప్రకటించింది. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్ బ్యాగ్స్ మేకింగ్ వివిధ వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటనలో వివరాలను వెల్లడించారు. ఆసక్తి గల యువతులు, మహిళలు ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్స్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఆర్జీవన్ సింగరేణి సేవాసమితి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

# ఎమ్మెల్సీ ని కలిసిన ప్రజలు



**దుండిగల్, అక్టోబర్ 6, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, తదితరులు దసరా పండగ పర్వదిన సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

# మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం, బోడగుట్టకు చెందిన ఖలీల్ పాషా సోమవారం సాయంత్రం బస్టాండ్ ప్రాంతంలోని ఆర్టీసీ బంక్ వద్ద జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ వెంటనే స్పందించి ఖలీల్ పాషాను తన వాహనంలో ఆస్పత్రికి తీసుకుని వెళ్లి అక్కడ ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రమాదం గురించి సమాచారం అందించారు. మానవత్వంతో స్పందించి దగ్గరుండి ఆసుపత్రికి తరలించిన ఎస్సై ప్రవీణ్ కుమార్ కు క్షతగాత్రుడు ఖలీల్ కుటుంబ సభ్యులతో పాటుగా ఘటన స్థలంలో ఉన్న ప్రజలు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.



# ఎడిటోరియల్

## జనసేనలో ఇక... పవనిజం.. !

జనసేన పార్టీలో సమూల మార్పుల దిశగా ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణకు పెద్ద పీట వేస్తున్నారు. గత నెలలో నిర్వహించిన సేనతో సేనాని కార్యక్రమంలో ప్రకటించిన త్రిశూల్ వ్యూహానికి పదును పెంచారు. తాజాగా నిర్వహించిన పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో ఈ వ్యవహారంపై ఆయన చర్చించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోనూ భేటీ అయిన పవన్ కల్యాణ్.. పార్టీ అంతర్గత అంశాలపైసుదీర్ఘంగా వారిని అడిగి తెలుసుకున్నారు. వివాదాస్పద నాయకులు, వివాదాస్పద వ్యవహారాలు వంటివాటిపై నిశితంగా ప్రశ్నించారు.అనంతరం.. త్రిశూల్ వ్యూహాన్ని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. పార్టీలో సుదీర్ఘ కాలం నుంచి ఉంటూ కూడా.. గుర్తింపు లేకుండా పోయిందన్న ఆవేదన వినిపిస్తున్నవారు.. వందల్లోనే ఉన్నారని చెప్పిన పవన్ కల్యాణ్వారికి న్యాయం జరగాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా.. వారి చెంతకు వెళ్లి.. వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ఎక్కడా నిర్లక్ష్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యతను కూడా వారికే అప్పగించారు. అదేసమయంలో యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. త్రిశూల్లో తొలి కార్యాచరణ ప్రకారం.. ఎక్కువ మంది యువతకు అవకాశం ఇవ్వనున్నారు.వారితో ఉన్న నాయకత్వ లక్షణాలను వెలుగులోకి తీసుకువచ్చి.. వారిని పార్టీకి అనుకూలంగా మార్చుకుంటారు. మరీ ము ఖ్యంగా నాయకులకు చేరువ కావడం పట్ల ఎక్కువగా ఫోకస్ పెడతారు. ప్రస్తుతం పార్టీలో ఒక నిర్వేదం అయితే కనిపిస్తోందని అన్నారు. %--%నేను వస్తేనే పార్టీ వచ్చినట్టు కాదు. మీరు వెళ్లినా.. అదే తరహా పరిస్థితి ఉండాలి. ఇలా ఎందుకు ఉండడం లేదో మీరు ఆలోచించుకోవాలి. నేను వచ్చినప్పుడు.. అనేక సమస్యలు చెబుతున్నారు. కానీ, మీరు వెళ్లినప్పుడు అదే నాయకులు, కార్యకర్తలు ఎందుకు చెప్పడం లేదు అని ఎమ్మెల్యేలను ఉద్దేశించి పవన్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది.ఇక, ఇదేసమయంలో అసెంబ్లీ హాజరు, ప్రశ్నలు సంధించిన తీరుపై కూడా పవన్ ఎమ్మెల్యేలకు కొన్ని సూచనలు చేశారు. ఒకరిద్దరు ముక్తసరిగా సభలో హాజరయ్యారని కూడా నిర్మొహమాటంగా వ్యాఖ్యానించారు. ఎలాంటి హోం వర్క్ చేయకుండానే సభకు ఎందుకు వచ్చారని వారిని ప్రశ్నించారు. అదేసమయంలో వివాదాస్పద అంశాలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలకు కూడా ఆయన క్లాస్ తీసుకున్నారు. ముందుగా అందరితోనూ.. తర్వాత ఒక్కొక్కరుగా కూడా పవన్ భేటీ అయ్యారు. పార్టీలో కొన్ని కట్టుబాట్లు ఉన్నాయని.. అందరినీ కలుపుకొని పోవాలని నాయకులకు సూచించారు. దీంతో జనసేనలో ఇక, పవనిజం పుంజుకుంటుందన్న సూచనలు ఇవ్వకనే ఇచ్చారని అంటున్నారు.

# నకిలీ మద్యం కేసు మూలాలు ఇబ్రహీంపట్నం లో

**ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం తయారీ పై అనుమానాలు**

**అద్దేపల్లి జనార్ధన్ సంబంధించిన గోడౌన్ లో లో అధికారుల తనిఖీలు**

**తనిఖీల లో విస్తుపోయే పోయే నిజాలు**





**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06 (వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్రాన్ని కుదిపేసిన నకిలీ మద్యం చేస్తూ మూలాలు ఇబ్రహీంపట్నం లో తేలాయి. చిత్తూరు జిల్లా ములకల చెరువు నుండి ఇబ్రహీంపట్నం వరకు నకిలీ మద్యం లింకులు బయటపడుతున్నాయి. అన్నమయ్య జిల్లా ములకల చెరువు కల్తీ మద్యం కేసులో ఏఎన్ఆర్ బార్ నిర్వాహకుడు అద్దేపల్లి జనార్ధన్ పై కేసు నమోదు అయింది. జనార్ధన్ ఇబ్రహీంపట్నంలో ఏఎన్ఆర్ బార్ నిర్వహిస్తున్నాడు. మద్యం కేసులో ఏ 1 ముద్దాయి అద్దేపల్లి జనార్ధన్ కు సంబంధించిన ఇల్లు, గోడౌన్ లలో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో విస్తూపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. జనార్ధన కు సంబంధించిన గోడౌన్ లలో ఖాళీ మద్యం సీసాలు, స్పిరిట్ క్యాన్లు, మద్యం తయారీకి సంబంధించిన సామాగ్రి లభించడంతో అధికారులు విస్తుపోయారు. వాటిని సీజ్ చేసి తరలించారు అధికారులు. ఇంత భారీ స్కామ్ కు సంబంధించి మూలాలు ఇబ్రహీంపట్నంలో రావడంతో హాట్ టాపిక్ గా మారింది. తయారైన నకిలీ మద్యం స్థానికంగా ఉన్న మద్యం షాపుల్లో చేరిందా.. ప్రజలు తాగుతుంది నాణ్యమైన మధ్యమైనా అనే అనుమానాలు ఇప్పుడు సంచలనగా మారాయి.

# నిందించుట తేలిక!




తేలిక నిందించడము
కష్టము భరించడము
వేయరాదోయ్! నిందలు
విరచరాదు మనసులు
పరులనింద పాపమే
చూడంగా నీచమే
లేనిపోని వాటితో
గాయపడును హృదయమే
వ్యక్తిత్వం శ్రేష్టమే

మేలిమి బంగారమే
కల్గియుంటే మాత్రము
పెంచుతుంది గౌరవమే
జాగ్రత్త అవసరమే
సంస్కారము సౌఖ్యమే
నోరుజారక ముందు
ఆలోచన ముఖ్యమే

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, 9966414580

# వైసీపీ నాయకులూ మీరు చెయ్యలేరు... ఎదుటివారు చేస్తే తట్టుకోలేక విమర్శలా

- **అభివృద్ధిలో ....అన్ని రంగాల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం దూకుడు ఎవ్వరూ ఆపలేరు**
- **విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్ యాదవ్,**




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్ లో ఉన్న తెదేపా బి సీ సెల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో విజయవాడ పశ్చిమ తెదేపా బి సి సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్ మాట్లాడుతూ వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. విజయవాడ లో జరిగిన 11 రోజులు దసరా తో పాటు విజయవాడ ఉత్సవ్ ఘనంగా జరగడంతో తట్టుకోలేక ఇప్పటికే ఈ జిల్లాలో ఒక్క సీటు కూడా లేక పోగా విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విజయవాడ ఉత్సవ్ తో వైసీపీ నాయకులు తమ గుర్తింపు కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని గ్రహించి, పోతిన మహేష్, దేవినేని అవినాష్ వారి నోటికి వచ్చిన విధంగా మాట్లాడటం సరికాదన్నారు,అమ్మవారి దర్శనానికి మునుపెన్నడూ లేని విధంగా లక్షలాదిమంది తరలివచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయడం అది కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు,భక్తులందరికీ అమ్మవారి దర్శనం సులువుగా అందాలని 500 రూపాయల టికెట్ను రద్దు చేస్తే భక్తుల వెసులుబాటు గురించి పట్టించుకోకుండా పోతిన మహేష్ ఆదాయం గతం కంటే కోటి రూపాయలు తగ్గిందని మాట్లాడటంతో ఆదాయం మీద ఉన్న శ్రద్ధ భక్తుల మీద వారికి వారి ప్రభుత్వానికి లేదన్నది అర్థమవుతుందన్నారు,మీ ప్రభుత్వంలోవిజయవాడ నగరవాసులు కార్తీక మాసంలో భవాని, అయ్యప్ప స్వామి, శివ మాలలు దీక్షలు స్వీకరించిన సమయాన్న గతంలో ఉన్న నదీ స్నానాలు కల్పించుటకు ఏర్పాటు చేయమని ఆనాటి వైసిపి ఎమ్మెల్యే మాజీ దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ని భక్తులందరూ వెళ్లి పలుమార్లు వినతి పత్రం ఇచ్చినప్పటికీ మీరు పట్టించుకోపోవడాన్ని నగరవాసులు ఎవరు ఇంకా మర్చిపోలేదన్నారు,దేవినేని అవినాష్ మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని విజయవాడ ఉత్సవ్ పేరుతో వ్యాపారస్తుల దగ్గర, పలు అసోసియేషన్స్ దగ్గర కోట్ల రూపాయలు వసూలు చేశారని ఇటువంటి అసత్య ఆరోపణలు చేయడం ద్వారా గతంలో విజయవాడ నగరంలో వారి కుటుంబానికి ఉన్నటువంటి గుర్తింపును కోల్పోతున్న వాస్తవాన్ని గ్రహించ లేకపోతున్నారని ఎద్దేవా చేశారు.కేశినేని చిన్ని మునిపెన్నడు లేనివిధంగా ఈ విజయవాడ ఉత్సవ్ ఏర్పాట్లు లో భాగంగా పౌరాణిక నాటికలు కూచిపూడి, భర్తనాట్యం కార్యక్రమాలతో పాటు అన్ని వర్గాల వారికి అన్ని వయసుల వారికి ఆహ్లాదకరంగా ఉండే విధంగా దాదాపుగా 280 పైన ఈవెంట్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల హృదయాలలో మరింత ఉన్నత స్థానాన్ని పొందడమే కాకుండా గతంలో చేసిన ఎంపీలు ఎవరూ కూడా ఈ విధంగా ఏడు నియోజకవర్గాల మీద దృష్టి పెట్టి ప్రజలతో మమేకమై తిరిగింది లేదని ప్రజలు అనుకుంటున్నారని భాను ప్రకాష్ స్పష్టం చేశారు. కుళ్ళుబోతు ఆలోచనలు నుండి వాస్తవాన్ని అంగీకరించే బుద్ధిని ఆ భగవంతుడు దేవినేని కి పోతిన కి కలిగించాలని కోరడం తప్ప మనమేమీ చేయలేమని నమ్మి భాను హేళన చేశారు.

# పుప్పాల శ్రీనివాసరావుకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు






**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 6 : (వార్తా ప్రభ ప్రతినిధి) :** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవసందర్భంగా విజయవాడ వించిపేట కు చెందిన శ్రీవిద్యాంజలి హైస్కూల్ అధినేత పుప్పాల శ్రీనివాసరావుకు ఉత్తమ ఉపాధ్యాయుడిఅవార్డు లభించింది. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్అసోసియేషన్లి-అమరావతి) (అప్స) వారి ఆధ్వర్యంలో విజయవాడ, ఈడుపుగల్లు లో గలసీతారామ గార్డెన్స్ కల్యాణమండపం నందు ఉత్తమ ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం ఘనంగాజరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుండి 300 మంది ఉపాధ్యాయులకు సత్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యూటరియల్స్ అసోసియేషన్ లో విజయవాడ వన్టౌన్, భవానీపురం డివిజన్ నుండి శ్రీవిద్యాంజలి హైస్కూల్ అధినేత పుప్పాల శ్రీనివాసరావును ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి, అప్స ఐ కాన్ అకడమిక్ ఎచీవర్ అవార్డు - 2025తో సత్కరించినట్లు అప్స కౌన్సిల్ సభ్యులు ఆరుమళ్ళ మోహన్ రెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగాసన్మాన గ్రహీత పుప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత 33సంవత్సరాలుగా విద్యా సేవలో ఎంతో మంది పేద మధ్య తరగతి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దానని, ఇకముందు కూడా అనేక మంది విద్యార్థులను ఉత్తమపౌరులుగా తయారు చేసి ఈ సమాజానికి అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్స రాష్ట్ర అధ్యక్షులు వి. సుబ్రహ్మణ్య రాజు, సెక్రటరీ టి. సింహాచలం, విసిఎస్ అండ్ టిఎ అధ్యక్షులు ఎం.శ్రీహరిరావు, సెక్రటరీ బి. గణేష్ బాబు, ఎస్ కె. ఇమామ్, వి. మురళి మోహన్, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో 40 లక్షల బెల్ట్‌షాపులు

- **కల్తీ మద్యంతో 30 వేల మంది బలి**
- **మద్యం కుంభకోణంతో 3,500 కోట్లు కొల్లగొట్టిన జగన్ ప్రభుత్వం**
- **వైసీపీ నేతల మాఫియాలో జగన్ భాగస్వామి**
- **టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్**



**అమరావతి అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే పలువురిని అరెస్టు చేశామని, ఇలాంటి చట్ట విరుద్ధ చర్యలపై ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్లరమేష్ తెలిపారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆదేశాల మేరకు కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకులు దాసరిపల్లి జయచంద్ర రెడ్డి, కట్టా సురేంద్రనాయుడులను పార్టీ నుండి సస్పెండ్ చేసి, తగిన విచారణ చేపట్టాలని నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇది కూటమి తెలుగు దేశం పార్టీ నిబద్ధతకు నిదర్శనమని, ఎవరో ఎక్కడో తప్పు చేస్తే దాన్ని ప్రభుత్వానికి, పార్టీకి అంటగట్టేలా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని వాస్తవాలను వక్రీకరించి జగన్ మద్యం కుంభకోణంలో కొండత దోపిడీని కప్పిపెట్టుకొనే కుట్ర నాటకం ఆడుతున్నారని ఆయన విమర్శించారు. వైసీపీ హయాంలో విజయవాడలో మీ పార్టీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంబంధించిన బార్ లో కల్తీ మద్యం వల్ల 6గురు చనిపోతే సమర్థించావు. మల్లాది విష్ణుని ఎందుకు ఆనాడు సస్పెండ్ చేయలేదని జగన్ పై ఆయన విరుచుకుపడ్డారు. మీకు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టి కదా? అని ఆయన ప్రశ్నించారు. కల్తీ మద్యంలో నిందితులుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని వైసీపీ పార్టీ నుంచి జగన్ రెడ్డి ఎందుకు సస్పెండ్ చేయలేదని అయిన మీరు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టి జే బ్రాండ్ల మద్యంలో విషపూరిత పదార్థాలు ఉన్నట్టు చెన్నై, బెంగళూరుతోపాటు అమెరికాలోని ప్రముఖ ల్యాబ్ లు నిర్ధారించాయని, అయినా జగన్ ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేదు? మీరు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టి కాదా అని ఆయన విమర్శించారు. జగన్ పాలనలో జంగారెడ్డి గూడెంలోనే కల్తీ నాటుసారా తాగి 27 మంది పేదల ప్రాణాలు పోతే వారిపై చర్యలు తీసుకోకుండా సమర్థించారని వైసిపి హయాంలో మద్యం రేట్లు పెంచడం వల్ల మద్యానికి బానిసైనా వ్యక్తులు శానిటైజర్ త్రాగి 48 మంది చనిపోయారని ఆయన విమర్శించారు. గత ఐదేళ్లు కల్తీ మద్యంతో దోచుకున్న డబ్బులతో ఆఫ్రికాలో సునీల్ రెడ్డి, చెవిరెడ్డి, ద్వారంపూడి, వైసిపి నేతలు వ్యాపారా సామ్రాజ్యాలు నెలకొల్పుకున్నారని అన్నారు. వారి యొక్క ఆఫ్రికా నేరాలను చంద్రబాబుకు అంటగట్టి సాక్షిలో బ్యానర్ ఐటమ్ గా వస్తే నమ్మటానికి ఆంధ్రులు అమాయకులు కాదని ఆయన అన్నారు. జగన్ ఐదేళ్ల పాలల్లో విషపూరిత మద్యం తయారుచేసి 3500 కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆయన మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలెం లో మద్యం తాగిన వారు నరాల వ్యాధి, కిడ్నీ వ్యాధులు, కలేయ వ్యాధులతో 30 వేల మంది పేదలు మరణించారని ఆయన వివరించారు. అలాగే విషపూరిత మద్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది ఆరోగ్యాలు ధ్వంసమయ్యాయని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో జగన్ పాలనలో 40 లక్షల బెల్ట్ షాపులు నడిచాయని, కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపులు నడిపిన వారిపై ఐదు లక్షల జరిమానా విధించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పాతర్ల రమేష్ తెలియజేశారు.

# మా ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో దసరా ప్రభల ఉత్సవాలు భేష్

***సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశంసలు***



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 6: (వార్తా ప్రభ ప్రతినిధి)** దసరా ఉత్సవాల సందర్భంగా మా ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో ప్రభల ఉత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశంసించారు. శనివారం రాత్రి గాంధీ నగర్ లో మా ఆర్ట్స్ నిర్వాహకులు చింతల రామారావు (బాబి), చంటి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా బాబి, చంటి బ్రదర్స్ దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా 40 ప్రభ బండ్లు ఏర్పాటు చేయడం, అంగరంగవైభంగ ప్రభ బండ్లు కట్టి ప్రజలకు కనువిందు చేయడం ఎంతో సంతోషకరమని ఆయన అన్నారు. దసరా అంటేనే అమ్మవారి శరన్నవరాత్రులను వైభవంగా నిర్వహించడంతో పాటు ప్రభల బండ్లు, దసరా వేషాలు, బేతాళ నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం మన సంస్కృతికి నిదర్శనమని ఆయన చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఈ ఉత్సవాలను తిలకించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొలనుకొండ శివాజీ, యర్రంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడండి

***విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు***





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కెనాల్ రోడ్, వినాయకుని గుడి, శనీశ్వరాలయం, కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, పున్నమిఘాట్, హెచ్ బి కాలనీ ప్రాంతాలని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అయిపోయినప్పటికీ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే సౌకర్యాన్ని కల్పించడంలో ఎటువంటి లోపం ఉండరాదని, అధికారకంగా అక్టోబర్ 5 వరకు సౌకర్యాలు కల్పించాలని ఉన్నప్పటికీ భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న సందర్భంలో వారికి త్రాగునీటి సౌకర్యంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, ఉత్సవం అయిపోయిన తర్వాతే పారిశుధ్య నిర్వహణలో ఎక్కువగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.తదుపరి ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లో ఉన్న హెచ్ బి కాలనీ అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఎటువంటి మరమ్మతులు ఉండరాదని, ఏవైనా ఉన్నచో వెంటనే 15 నిమిషాలలో వాటిని సరి చేయాలని, అన్న క్యాంటీన్లో వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని, అన్న క్యాంటీన్ నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు అన్న క్యాంటీన్ ను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులని ఆదేశించారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణపై జోనల్ కార్యాలయాలు,**

## సచివాలయాల్లో ఆకస్మికంగా తనఖీ నిర్వహించాలి

***విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర***




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశా ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణపై విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోగల జోనల్ కార్యాలయాలు మరియు సచివాలయాల్లో ఆకస్మికంగా తనఖీ నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయమని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అధికారులను ఆదేశించారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణపై ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి జోనల్ కార్యాలయాలు మరియు సచివాలయాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి అధికారులు స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటికి వారు చూపుతున్న పరిష్కారం, ప్రజలతో వాళ్ళు వ్యవహరిస్తున్న పనితీరు వంటి అంశాలపై ఈ కమిటీ పరిశీలించాలని కమిషనర్ అన్నారు.ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ ధ్యానచంద్ర ప్రధాన కార్యాలయం తో పాటు జోనల్ కార్యాలయాల్లో, సచివాయాలలో విసి ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు ఎటువంటి సమస్య రానివ్వకుండా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తమ తమ పరిధిలో గల ప్రాంతాలన్నీ పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన సమస్య ను ఫిర్యాదునీదారుల వద్దకు వెళ్లి సమస్యను పూర్తిస్థాయిలో తెలుసుకొని మరలా పునరావతం కాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 19 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజనీరింగ్ 10, రెవిన్యూ 3, ఎస్టేట్ 1, హార్టికల్చర్ 1 మొత్తం కలిపి 19 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇంచార్జ్ మరియు ఎస్టేట్ ఆఫీసర్ ఎ శ్రీధర్, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యకుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఆర్ఎఫ్ఓ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా తగ్గని ప్రయాణికుల రద్దీ

**కోదాడ, అక్టోబర్.6 (వార్తా ప్రభ ప్రతినిధి)**-దసరా పండుగ ముగిసి కూడా 4. రోజులు కావస్తున్నఇంకా ప్రయాణికుల రద్దీ తగ్గడం లేదు సోమవారం కోదాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి ప్రయాణికుల తాకిడి పెరగడంతో సరిపోను బస్సులు అందక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు తెలిపారు. దసరా పండుగ ముగియడంతో, హైదరాబాదులో వివిధ ఉద్యోగం చేసుకొని జీవనం గడిపేవారు, తిరుగు ప్రయాణమై, వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు తిరుగు ముఖం పట్టడంతో ప్రయాణికులు రద్దీ బాగా పెరిగింది

# మీకోసం అర్జీలను పరిష్కరించే విధానంపై అవగాహన కలిగి ఉండాలి - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజలు సమర్పించే మీకోసం అర్జీల పరిష్కార విధానంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు.సోమవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి సత్యనారాయణ, కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డిఓ కే స్వాతితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ముందుగా ఆయన మీకోసం పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. భూ రికార్డులు ల్యాండ్ సర్వే, రహదారులు భవనాలు శాఖలకు సంబంధించి అర్జీలు అత్యధికంగా పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్లో ఉంచకుండా నిర్ణీత సమయానికి పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అర్జీలు పరిష్కరించడంపై అధికారులకు అవగాహన కలిగించిన జిల్లా కలెక్టర్..మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించే విధానం, వాటిని ఆన్లైన్లో సమర్పించే ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. ప్రత్యేకంగా స్క్రీన్ పై పిజిఆర్ఎస్ ఆన్లైన్ పోర్టల్ ను ప్రదర్శించి అర్జీలను సరైన రీతిలో ఎండార్స్మెంట్ చేయవలసిన ప్రక్రియను వివరించారు. ఒక వ్యక్తికి చెందిన అర్జీను పూర్తిగా పరిష్కరిస్తేనే ఆన్లైన్ పోర్టల్ లో సిటిజన్ బెనిఫిటెడ్ అనే ఆప్షన్ ను ఎంచుకొని సమర్పించాలన్నారు. అలా కాకుండా అర్జీదారుని పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే గనక సిటిజెన్ యెట్ టు బి బెనిఫిటెడ్ అనే ఆప్షన్ను ఎంచుకొని సమర్పించాల్సి ఉంటుందని వివరణాత్మకంగా స్క్రీన్ పై చూపారు. ఇలా చేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా ఉంటాయని, అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపటానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండటంతో పాటు వారి కిందిస్థాయి అధికారి, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. లోటుపాటులను సరిచేసుకొని తప్పులు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీలలో కొన్ని:ఏ ధనుష్, సింధు అనువారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పలు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తమ వద్ద నుండి రూ.3.5 లక్షలు వసూలు చేసి మోసం చేశారని, తిరిగి ఆ నగదును ఇప్పించే విధంగా న్యాయం చేయాలని కోరుతూ ఉయ్యూరు మండలం, వీరవల్లి గ్రామానికి చెందిన యలవర్తి దేవి మీనాక్షి అర్జీ సమర్పించారు.కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి దేవస్థానం సుందరకాండ ప్రవచనములు



**మచిలీపట్నం అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుందరాకాండ మహాకావ్యం శ్రీ మద్రామాయణం లో అత్యంత ప్రాముఖ్యమైన భాగం అని పరాసు పేట లోని శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమేష్ అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో పరాసుపేట శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో రేపు మంగళవారం నుండి ది 13/10/2025 వ తేదీ వరకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మరియు టీటీడీ ధర్మ ప్రచార విభాగ ప్రవాచకులు అయిన బ్రహ్మశ్రీ వద్దమన్నాటి మారుతీ దివాకర శర్మ చే సుందరకాండ ప్రవచనము మంగళవారం నుండి ప్రతిరోజు సాయంత్రం 6:30 నుండి రాత్రి 8 గంటల వరకు ప్రవచనం నిర్వహించడం జరుగుతుందని, సదరు ప్రవచన కరపత్రాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమేష్ తదితరులు సోమవారం పరాసుపేట శ్రీ సువర్చల సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానమునందు కరపత్రాలను ఆవిష్కరించి, పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, ఆలపాటి రమేష్ మాట్లాడుతూ.....సుందరాకాండ మహాకావ్యం శ్రీ మద్రామాయణంలో అత్యంత ప్రముఖమైన భాగం అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం వారు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే విధంగా శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానమునందు సుందరకాండ ప్రవచనమును ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. మంగళవారం నుండి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, టీటీడీ ధర్మ ప్రచార విభాగ ప్రవాచకులు అయిన వద్దమన్నాటి మారుతి దివాకర శర్మ చే దేవాలయంలో జరిగే సుందరకాండ ప్రవచనం లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు అని కోరుచున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, మోపర్తి ఉమాదేవి, ఐ లా శివ నాగేశ్వరరావు, విశ్వనాథపల్లి నాగరాజు, నంది పాముల శ్రీనివాస్, జం పాని కనకదుర్గ రాజేష్ లతో పాటుగా బ్రాహ్మణ సంఘం నాయకులు, పి. వి. ఫణి కుమార్, ఎం. సుబ్రహ్మణ్యం, జె. ఎస్. ఆర్ .శర్మ, ముళ్ళపూడి వెంకట సీతాపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోవటం అంటే పారిపోవటమే -శాసనసభ్యులు యార్లగడ్డ



**గన్నవరం : అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శాసనసభ్యుడుగా గెలిచి అసెంబ్లీకి రాకపోవడం అంటే ప్రజాసమస్యలు పరిష్కరించలేక పారిపోవటం కాదా అని వైసీపీ ఎమ్మెల్యేలనుద్దేశించి ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సూటిగా ప్రశ్నించారు. పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి సురేష్ బాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా మదనపల్లెలోని పీకేయమ్ ఉడా కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన యార్లగడ్డ వెంకట్రావ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన సురేష్ బాబుకి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ వైసీపీ నుంచి తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ ముఖం చూడకుండానే పదవి కాలం పూర్తవుతుందని బాధపడుతున్నారని, కనీసం పెద్దిరెడ్డి లాంటి సీనియర్లైన జగన్ కు తగు సలహాలు ఇచ్చి ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపాలని సూచించారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి గైర్హాజరు కావటమంటే ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకుల పేలటం మానుకోవాలని హితవు పలికారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా నాలుగు సార్లు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ని గెలిపించిన కుప్పం ప్రజలను ఈ సందర్భంగా యార్లగడ్డ అభినందించారు. రాజకీయంగా చంద్రబాబుని విమర్శించ వచ్చుగాని పరిపాలనా దక్షతలో చంద్రబాబును మించిన నాయకుడు లేడని ఎమ్మెల్యే వెంకట్రావ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రిగా తొమ్మిదేళ్ల పాలనలో ఉమ్మడి రాష్ట్రంలో రూ. 3వేల కోట్ల బడ్జెట్ ను రూ.35 వేల కోట్లకు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుండి రూ.90 కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులను రూ.2.71 లక్షల కోట్లకు పెంచడంలో చంద్రబాబు చేసిన కృషిని కొనియాడారు. చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్ట్ చేసిన రోజే వైసీపీ పతనం ప్రారంభమైందని వైసీపీ దుర్మార్గ పాలన నుండి ప్రజలు తమను తాము రక్షించుకుని కూటమి పార్టీలకి తిరుగులేని విజయం చేకూర్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలోని ప్రజలకు స్వేచ్ఛా వాయువులు లభించాయని వాట్సప్ కాల్ నుండి సాధారణ కాల్ మాట్లాడుకునే స్థితికి చేరుకున్నారని తెలిపారు. చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు తన పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని, ప్రజలకు చేదోడు గ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా యార్లగడ్డతో ఫోటోలు దిగేందుకు టిడిపి కార్యకర్తలు పోటీపడ్డారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్, నగరి ఎమ్మెల్యే గాలి బాను, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, ఎమ్మెల్సీ శ్రీకాంత్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రాజ్ ట్రస్ట్ ద్వారా 26 మంది పేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ.

**రాజ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఆదర్శం, అతిధులు ప్రశంసలు.**





**కలిదిండి అక్టోబర్ 6 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా,కైకలూరు నియోజకవర్గం,కలిదిండి మండలం, కలిదిండి ఆర్సిఎం చర్చ్ ఆవరణలో భీమవరం రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు.భీమవరం రాజ్ ట్రస్ట్ అధినేత గంటా రాజ్ కుమార్ సహకారంతో, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ మార్గదర్శకత్వంలో, ఎస్సీ నాయకులు జక్కుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కలిదిండి, కైకలూరు ప్రాంతాలకు చెందిన 26 మంది పేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు, ఎలక్ట్రిక్ మోటార్లు, స్టూల్స్ అందజేశారు. అదనంగా ప్రతి మహిళకు రవాణా ఖర్చుల కోసం రూ.500 చొప్పున అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వల్లభనేని శ్రీవాస్ చౌదరి (నాని), మండల టీడీపీ అధ్యక్షులు జోగిరాజు, సీనియర్ న్యాయవాది యెలేటి న్యూటన్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కట్టా గోపి, రాష్ట్ర బీసీ నాయకులు కట్టా రాఘవులు తదితరులు హాజరయ్యారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ, భీమవరం రాజ్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని, కరోనా కాలంలోనూ రాజ్ ట్రస్ట్ వారు భీమవరం పట్టణమంతా ఆహార పదార్థాలు పంపిణీ చేయడం, శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం, ప్రతీ నెల 1,400 మందికి పైగా వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు రూ.500 చొప్పున ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సనమండ దాసు, జనసేన తంబీ, కూరెళ్ళ భోగేశ్వరరావు, గుట్ల ఈశ్వర్, అందుగాలా వెంకటరత్నం, మహిళలు మరియు అనేక మంది స్థానికులు పాల్గొన్నారు.

## తూర్పుపల్లి ఉపాధి హామీలో అవకతవకలు

**పనికి రాని వాళ్ళ పేర్లు రాసి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని కూలీల ఆవేదన**



**చేజర్ల అక్టోబర్ 06 (వార్తాప్రభ)** మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లే వారి కంటే పనికి రాని వారి పేర్లు రాసుకుంటూ ఎక్కడో ఉన్న వారి పేర్లు రాస్తూ అధిక లాభార్జన చేస్తున్నాడని సీనియర్ మేట్ లోకేష్ పై ఉపాధి హామీ కూలికి వెళ్లేవారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సోమవారం సంబంధిత ఏపీవో ని కలిసి ఉపాధి హామీ పనులలో తీవ్ర జాప్యం జరుగుతుందని దీనిని పరిశీలించి విచారణ చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.మేము పనికి వెళితే మాకు తక్కువ కూలి వేస్తున్నారని పనికి రాని వాళ్ల పేర్లు ఎక్కువ రాసుకుంటూ వారికి ఎక్కువ కూలి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని సోమవారం చేజర్ల గ్రీవెన్స్ లో అర్జీ ఇవ్వడం జరిగినది.అనంతరం స్థానిక ఎంపీడీవో తో కలిసి వినతి పత్రం అందజేస్తూ తూర్పుపల్లిలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనితీరును క్లుప్తంగా వివరించడం జరిగినది. అలాగే మాకు 8 వారాలకు పనికి వెళితే మూడు వారాలు మాత్రమే మాకు కూలీలు పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో పనికి రానివారు పేర్లు ఎలా రాస్తారని ప్రశ్నించారు. ఇదేమిటని సీనియర్ మేట్ ని అడిగితే మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి అంటూ మమ్మల్ని దూషిస్తున్నాడని నానా బూతులు తిడుతున్నాడని వారు విన్నవించారు.ఎంపీడీవో సానుకూలంగా స్పందించి వీటన్నిటిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

## పవిత్ర సంగమమా లేక బూడిద సంగమమా

- **ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతారా..?**
- **బూడిద కాలుష్యం పై మాజీ మంత్రి జోగి రమేష్ ఆగ్రహం**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆధ్యాత్మిక కేంద్రం అంటూ ఆర్భాటం చేసి పవిత్ర సంగమంలో బూడిద నీరు కలిసి బూడిద సంగమం గా మారిపోతుంటే ప్రభుత్వం కళ్ళు మూసుకొని చూస్తుందని... ఎన్ టి పి ఎస్ అధికారులు నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే ఇంతకన్నా దౌర్భాగ్యం ఏముందని మండిపడ్డారు మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్ జోగి రమేష్. ఇబ్రహీంపట్నం డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ నుండి బూడిద నీరు పట్టిసీమ కాలువ ద్వారా కృష్ణా నదిలో కలుస్తుంది. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర సంగమాన్ని సోమవారం నాడు జోగి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణానదికి ఇటు ఒడ్డున మేము - అటు ఒడ్డున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని,డా.ఎన్టీటీపీఎస్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే ప్రభుత్వం చూస్తూ ఉందని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే కు బూడిద అమ్ముకుంటే వచ్చే డబ్బు మీద ఉన్న ప్రేమ - స్థానిక ప్రజానీకం ఆరోగ్యం మీద లేదని విమర్శించారు.ప్రజల తరుపున కాలుష్యం పై ఉద్యమం చేస్తానని, తనతో కలిసి రావాలని అన్నారు.స్థానిక ప్రజలే కాదు, అటు పక్క అమరావతి ప్రజలు, క్రిష్ణానది దిగువు ప్రాంత ప్రజలు కూడా ఇదే నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నారని,కాలుష్య కోరల్లో చిక్కుకొని ఉన్న మా ప్రాంత ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రశ్నిస్తే కేసులు పెడితే భయపడి వెను తిరిగేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణా నదిలోకి బూడిద నీరు

**డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ అధికారుల దుశ్చర్య**

**లక్షలాది మంది తాగే నీటిలో బూడిద నీరు కలపడంతో ప్రజలు ఆగ్రహం**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఎన్టీటీపీఎస్ అధికారులు మరోసారి దుశ్చర్యకు పాల్పడ్డారు. గతంలో అనేకసార్లు బూడిద నీటిని కూలింగ్ కెనాల్ ద్వారా తాగునీటిలో కలిపి ఘనత వహించిన ఎన్టీటీపీఎస్ అధికారులు ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా బుడమేరు డైవర్షన్ చానల్ (వేడినీళ్ల కాలు) ద్వారా కృష్ణా నదిలోకి వదిలేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం ప్లాంట్ అధికారులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల నుంచి ప్లాంట్ లో బూడిద రవాణా నిలిచిపోవడంతో పెద్ద ఎత్తున ప్లాంట్ లో బూడిద పేరుకుపోయింది. దీంతో అధికారులు బూడిద నీటిని వేడినీళ్ల కాలువ ద్వారా కృష్ణా నదిలోకి వదిలేశారు. లక్షల మంది ప్రజలు తాగే కృష్ణా నీటిలోకి బూడిద నీరు కలపడం స్థానికులకు ఆగ్రహం తెప్పిస్తుంది. విజ్ఞత లేకుండా, విచక్షణ మరిచి బూడిద నీరు కాలువ ద్వారా కృష్ణా నదిలో కలపడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. బూడిద నీటి ద్వారా తాగునీరు కలుషితమై ప్రజలకు వ్యాధులు ప్రబలితే ఎన్టీటీ పీఎస్ యాజమాన్యం బాధ్యత వహిస్తుందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పందించి ఇలాంటి దుర్మార్గపు, దుశ్చర్యలకు పాల్పడుతున్న ఎన్టీటీపీఎస్ యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకొని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రొమ్ము క్యాన్సర్ పై అవగాహన అవసరం - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళలలో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండాలని, అందుకు ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మహిళలను కోరారు. పింక్ అక్టోబర్ సందర్భంగా జిల్లా కలెక్టర్ సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, అదనపు ఎస్పి సత్యనారాయణ, కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డిఓ కే స్వాతి, మచిలీపట్నం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత తదితరులతో కలిసి రొమ్ము క్యాన్సర్ అవగాహన నెల గోడపత్రికను ఆవిష్కరించారు.మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన శస్త్ర చికిత్స, క్యాన్సర్ వ్యాధి నిపుణులచే సోమవారం, గురువారం రోజులలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రోగులను పరీక్షించి రోగనిర్ధారణ పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా మహిళలను కోరారు.మచిలీపట్నం జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ పద్మావతి తదితర వైద్యులు పాల్గొన్నారు.

## సాంకేతిక రంగ అభివృద్ధికి రవికుమార్ నాయకత్వం దోహదం చేస్తుంది- ఎమ్మెల్యే కామినేని.

**ఆంధ్రప్రదేశ్ సైన్స్ , టెక్నాలజీ అకాడమీ చైర్మన్గా మండలపు రవికుమార్ బాధ్యతలు స్వీకరణ.**



**కైకలూరు అక్టోబర్ 6 (వార్తా ప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ %d% టెక్నాలజీ అకాడమీ చైర్మన్గా మండలపు రవి కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విజయవాడలో ఘనమైన మహోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ హాజరై, రవి కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రవికుమార్ నాయకత్వంలో రాష్ట్రంలో విజ్ఞాన, సాంకేతిక రంగాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రముఖులు, ఎన్డీఏ నాయకులు పాల్గొని రవికుమార్కు అభినందనలు తెలిపారు.

## వడ్డీ లక్ష్మీనరసమ్మ కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షించిన దూలం వినయ్.



**కలిదిండి అక్టోబర్ 6 (వార్తా ప్రభ)** దూలం వినయ్ ఈరోజు కలిదిండి మండలం,ఆవకూరు గ్రామంలో జరిగిన మాజీ గ్రామ సర్పంచ్ వడ్డీ సీతారామయ్య సతీమణి లక్ష్మీ నరసమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన లక్ష్మీ నరసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి, వారి బాధను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి %d% కలిదిండి మండలం ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి %d% ముదినేపల్లి మండలం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎం.డి. గాలిబ్ బాబు, ఆవకూరు సర్పంచ్ నరహరిశెట్టి నరసయ్య, జిల్లా బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పంజా నాగు, మాజీ సర్పంచ్ వడ్డీ గంగరాజు, రామిశెట్టి ప్రసాద్, కోరుకొల్లు మాజీ సర్పంచ్ చెన్నంశెట్టి సుబ్రహ్మణ్యం, కలిదిండి మండల మాజీ ఎంపీపీ వలవల రామారావు, కైకలూరు మండల యువజన విభాగ అధ్యక్షులు ఫిర్దోజ్ ఖాన్, నరహరిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పేరూరు, రేడిపూడి గ్రామాల్లో ఈరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

**ముదినేపల్లి అక్టోబర్ 6 (వార్తా ప్రభ)** ముదినేపల్లి విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.ఈరోజు మంగళవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు 33/11 కె.వి. పెదపాల్పరు సబ్స్టేషన్ పరిధిలోని 11 కె.వి. పేరూరు లైన్ ఫీడర్ లోని పేరూరు, రేడిపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, విద్యుత్ లైన్లకు దగ్గరగా పెరిగిన చెట్లను తొలగించే పనులు చేపడుతున్నారు. ఈ పనుల కారణంగా గృహ, వాణిజ్య మరియు ఆక్వా వినియోగదారులకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.అధికారులు ప్రజలను సహకరించాలని, విద్యుత్ అంతరాయం సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# వరి పంటను కాపాడడానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

- ఈ నెల 8 వ తేదీ బుధవారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రారంభం
- బ్రోమోడయోలోన్ ఎలుకల మందు కలిపిన ఎర రైతులకు ఉచితంగా పంపిణీ
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ సెంట్రల్, అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి) వరి రైతులు తరచుగా ఎదుర్కొంటున్న ఎలుకల సమస్యను నివారించి, పంటను కాపాడటానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వరి సాగు చేసే ప్రాంతాలలో బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను స్థానిక కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్%ష% మాట్లాడుతూ.... ఎలుకల వల్ల తీవ్ర పంట నష్టం సంభవిస్తోందని, దీనిని నివారించడానికి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రైతు సేవ కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల నుంచి బ్రోమోడయోలోన్ ఎలుకల మందును కలిపిన ఎరను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఎలుకలు ఉన్న బొరియలను గుర్తించి వాటిని మట్టితో కప్పి ఉంచాలని, మరుసటి రోజు తెరుచుకుని ఉన్న బొరియలలో బ్రోమోడయోలోన్ ఎలుకల మందు కలిపిన ఎరను ఉంచి మూసివేయాలని తెలిపారు. రైతులంతా సామూహికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని, తద్వారా వరి పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ కుమారి, డిఆర్ఓ లక్ష్మీ నరసింహం, డిప్యూటీ కలెక్టర్ కె.పోశి బాబు, వ్యవసాయ శాఖ ఏడి అనిత భాను పాల్గొన్నారు.

# బూడిద టెండర్ కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06 (వార్తా ప్రభ ప్రతినిధి): ఎన్టీటీపీఎస్ బూడిద టెండర్ ను రద్దు చేయాలని కోరుతూ ఎన్టీటీపీఎస్ టిప్పర్ లారీ ఓనర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో నిరసన ర్యాలీ, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. గత కొన్ని రోజుల నుంచి లారీ ఓనర్లు, డ్రైవర్లు నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలు నిర్వహిస్తు న్నారు. దీనిపై ఎన్టీటీపీఎస్, ఏపీ జెన్ కో యాజమాన్యాలు స్పందించకపోవడంతో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేశారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం పెట్రోల్ బంక్ నుంచి ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా భారీగా మోహరించిన రోప్ పార్టీ పోలీసులు, ఎస్పీఎఫ్ బలగాలు అడ్డుకున్నారు. ఎన్టీటీపీఎస్ కు, చీఫ్ ఇంజనీర్ కు వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న రిలే దీక్షా శిబిరానికి చేరుకున్నారు. అక్కడికి వచ్చిన చీఫ్ ఇంజనీర్ శివ రామాంజనేయులుకు కాలుష్య సమస్యలు – పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బూడిద టెండర్ ను రద్దు చేసి లోకల్ లారీ డ్రైవర్లకు ఉచితంగా బూడిద లోడింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను ఏపీ జెన్ కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఈనెల 10వ తేదీలోగా పరిష్కారానికి దిశగా చర్యలు తీసుకుంటామని సీఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, గుంటుపల్లి సర్పంచ్ భూక్యా కవిత, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి అక్కల గాంధీ, జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదర్ల రవి, మున్సిపల్ కౌన్సిలర్లు, టిప్పర్ లారీ ఓనర్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# నారా వారి సారా కేంద్రం గా రాష్ట్రం

## - మాజీ మంత్రి జోగి ఆరోపణ



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06 (వార్తా ప్రభ ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని నారావారి సారా కేంద్రంగా మార్చారని విమర్శించారు మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం పట్టుబడిన నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్తీ మద్యం పట్టుబడిన గోడౌన్ ను, క్యాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జోగి మాట్లాడుతూ ఫేమస్ బ్రాండ్లను కల్తీ చేసి పేదవాడికి విషమిచ్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం కల్తీ మద్యం తయారు చేయించి వైన్ షాపులు, బెల్టు షాపులకు తరలిస్తుందన్నారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నుంచి దక్షిణాఫ్రికా వరకు పాకిందంటే ప్రభుత్వానికి తెలియకుండా జరుగుతుందా? అని ప్రశ్నించారు. ఇది ఒక కార్యకర్త, ఒక నాయకుడికి సంబంధించిన విషయం కాదన్నారు. ఒక దొంగ డిస్టిలరీ పెట్టి కల్తీ మద్యం తయారు చేసి వైన్ షాపులు, బెల్టు షాపుల ద్వారా ప్రతి గడపకు చేరవేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. డబ్బు కోసం ఇంత నీచానికి ఒడిగడతారా? బార్ లకు, వైన్స్ లకు వెళ్లలేదని చెప్పడానికి ఎక్సైజ్ పోలీసులు చూశారా? అని ప్రశ్నించారు. నకిలీ డిస్టిలరీ ఫ్యాక్టరీలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఈవీఎం మాయతో గెలిచిన మోడీ గద్దె దిగాలి

## - కాంగ్రెస్ పార్టీ డిమాండ్



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06 (వార్తా ప్రభ ప్రతినిధి): దొంగ ఓట్లతో గెలిచిన ప్రధాని నరేంద్ర మోడీ గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. మోడీ గద్దె దిగాలని, వారి మిత్రపక్ష ఎన్డీయే కూటమికి సహకరిస్తున్న ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఓటు చోరీ.. గద్దె చోడ్ పోరాటానికి మద్దతుగా పీసీసీ చీఫ్ వై.ఎస్.షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నేతలు సోమవారం గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ లో పర్యటించారు. ఐఎన్టీయూసీ అనుబంధ కార్మిక సంఘం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి గద్ద సురేష్, యూనియన్ నాయకులను కలిసి వారి మద్దతు కోరారు. కరపత్రాలు పంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎన్నికలపై లేవనెత్తున సందేహాలు, ఆరోపణలకు ఎన్నికల కమిషన్ సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార బీజేపీతో ముఖ్యంగా మోడీ, అమిత్ షాలతో కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కైందన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల దొంగ ఓట్ల చోరీపై ఏర్పాటుచేసిన మీడియా సమావేశం దేశంలో ప్రకంపన సృష్టించిందన్నారు. అధికార పార్టీతో కుమ్మక్కైన ఎన్నికల సంఘం పారదర్శకత లేకుండా ఓట్లను తొలగించిందని ఆరోపించారు. అక్రమార్కులను శిక్షించాలని, రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు మద్దతుగా నిలిచి ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు, పోతురాజు థామస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం పై స్పెషల్ డ్రైవ్

## పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06 (వార్తా ప్రభ ప్రతినిధి): కొండపల్లి మునిసిపాలిటీ ఇబ్రహీంపట్నం లోని 23,24 వార్డుల్లో పారిశుధ్యం పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ చిట్టిబాబు స్థానిక కౌన్సిలర్ అమ్మాజీ, పులి దాసు లతో కలిసి పరిశీలించారు. జాకీర్ హుస్సేన్ కాలేజీ రోడ్ లో డ్రైనేజీ పక్కన పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బందికరంగా ఉండటం తో స్థానిక వార్డు కౌన్సిలర్లు చైర్మన్ చిట్టిబాబు దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన పారిశుధ్యం కార్మికులతో నేడు, రేపు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అదే విధంగా పారిశుధ్యం సిబ్బందికి ప్రతి రోజూ చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జనార్ధన్ స్వామి దాసు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# “ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులుగా డాక్టర్ టి. సేవ కుమార్ ఎన్నిక “





గుంటూరు టౌన్ అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖకు ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్లో నిర్వహించిన 2025-2026 కార్యవర్గం ఎన్నికలలో అధ్యక్షులుగా డాక్టర్ టి .సేవ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం .శివప్రసాద్ ,కార్యదర్శిగా డాక్టర్ బి .సాయి కృష్ణ,సంయుక్త కార్యదర్శిగా చిలకా శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మరో 25మంది ఎన్నికయ్యారు .అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ టి .సేవకుమార్ 2004లో ఐఎంఏ గుంటూరు శాఖలో సభ్యత్వం పొంది , శాఖలో అంచలంచలుగా క్రింది అన్ని పదవులు నిర్వహించి ఇప్పుడు అధ్యక్ష పదవి అందుకున్నారు. ఐఎంఏ కార్యక్రమాలలో క్రియాశీలకంగా ఉన్న డాక్టర్ టి. సేవకుమార్ ,గతంలోరాష్ట్ర వర్కింగ్ కమిటీలో, ఐఎంఏ వివిధ స్కీములలో పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జాతీయ కౌన్సిల్ మెంబర్ గా వ్యవహరిస్తున్నారు .గుంటూరు వైద్య కళాశాల నుండి ఎంబిబిఎస్ పట్టా పొందిన డాక్టర్ టి. సేవ కుమార్,1996లో బ్రాడీపేటలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్ హెచ్ ఓ) ను స్థాపించి నాటి నుండి నేటి వరకు ఉచిత వైద్య సలహాలు, అతి తక్కువ ఖర్చుకి అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందిస్తున్నారు .రాష్ట్రంలో జనరిక్ మందులపై ప్రజలలో శాస్త్రీయ అవగాహన కల్పించడంలోనూ, జనరిక్ ఫార్మసీల ఏర్పాటులోనూ కీలకపాత్ర పోషించారు .ప్రజల నిత్యావసర వస్తువులు, అన్ని రకాల ఆహార పదార్థాలు, అన్ని రకాల మందులపై జిఎస్టి జీరో లేదా నామమాత్రం గా ఉండాలని పోరాటాలు చేశారు, చేస్తున్నారు. అంతేగాక వైద్య, ఆరోగ్య అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు 12 సంవత్సరాల పాటు “హెల్త్ హెల్ప్ “మాసపత్రికను నిర్వహించారు. ఆ పత్రికను పోస్టల్ శాఖ మార్కెటింగ్ చేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘంలో సభ్యుడైన డాక్టర్ టి. సేవకుమార్,వివిధ పత్రికల్లో వైద్య, ఆరోగ్య ,విద్య, రాజకీయ అంశాలపై అనేక వ్యాసాలు రాశారు .2020 లో స్వయంగా ఎస్ హెచ్ ఓ ఏ పీ- టీవీ- యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించి ,వీడియోల ద్వారా వివిధ రంగాలలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థలలో పాలకవర్గ సభ్యుడైన డాక్టర్ టి. సేవకుమార్ అధ్యక్షుడుగా ఆ పదవికి వన్నె తెస్తారని వైద్యులు ఆశిస్తున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ సేవకుమార్ ను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్, పూర్వ అధ్యక్షులు, డాక్టర్ ఎన్. కిషోర్, ఐ .ఎం .ఎ. సి.జి. పి రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఎం .ఫణికుమార్, ఎన్నికల నిర్వహణ అధికారి, డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావు, ప్రస్తుత ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు, డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, ఉపాధ్యక్షులు ,డాక్టర్ డి. అమరలింగేశ్వర రావు తదితరులు అభినందించారు. తనను ఏకగ్రీ వంగా ఎన్నుకున్న వైద్యులందరికీ డాక్టర్ టీ. సేవ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శాఖ కార్యక్రమాల లో క్రియాశీలకంగా ఉంటూ, రాష్ట్ర కార్యవర్గంతో కలిసి వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పాలిక నరసింహమూర్తి



కాకినాడ, అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ (అప్సా) అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా కాకినాడ మూర్తి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ పాలిక నరసింహమూర్తి ఎన్నికయ్యారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శిగా తోటకూర వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ నియామక ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవాడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు ప్రధాన అతిథిగా పాల్గొని కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు పాలిక నరసింహమూర్తికి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘన సత్కారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రైవేట్ స్కూల్‌ల కరస్పాండెంట్లు, ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ సమారంభంలో శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ బి.ఎస్.పి. చౌదరిని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. రాష్ట్ర నాయకత్వం కొత్తగా ఎన్నికైన సభ్యులను ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో అద్భుతమైన సేవలందించాలని ఆకాంక్షించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాలిక నరసింహమూర్తి మాట్లాడుతూ, “అప్సా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను. సంఘంలో ఏ సభ్యుడికి ఇబ్బందులు ఎదురైనా వారికి అండగా నిలుస్తాను,” అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తన ఎంపికకు సహకరించి ప్రోత్సహించిన రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సుందర రామశర్మతో పాటు అన్ని రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ప్రతినిధులు, మరియు అనేక మంది విద్యా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుంది-జి.టి.వి.రమణ

## *జి.కొండూరు డిప్యూటీ ఎంపీడీవో కొత్త శ్రీనివాసరావు-సరోజ దంపతులకు ఘన సన్మానం.*





జి.కొండూరు అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి) :ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.టి.వి రమణ అన్నారు. మండలం లోని చెవుటూరు గ్రామ శివారు గోశాల ఆవరణ లో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల డిప్యూటీ ఎంపీడీవో పనిచేస్తూ 2025 సెప్టెంబర్ 30వ తేదీ న ఉద్యోగ విరమణ చేసిన కొత్త శ్రీనివాసరావు సన్మాన సభ సోమవారం సాయంత్రం జి.కొండూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి,ఎన్టీఆర్ జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏటుకూరి బసవలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కొత్త శ్రీనివాసరావు ఆయన సతీమణి సరోజ దంపతులను సన్మాన సభలో ఉద్యోగి చేసిన సేవలను కొనియాడుతూ, జ్ఞాపికలు, పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన జి.టి.వి.రమణ తో పాటు పలువురు మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా పంచాయతీరాజ్ శాఖ లో వివిధ హోదాలలో పనిచేసి అటు ప్రజా సమస్యలను పరిష్కరించడం, ఉద్యోగ నిర్వహణలో తోటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కొత్త శ్రీనివాసరావు ముందుండేవారని కొనియాడారు. డిప్యూటీ ఎంపీడీవో గా జి.కొండూరు మండలానికి బదిలీపై వచ్చిన కొత్త శ్రీనివాసరావు విధినిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్నలను పొందారన్నారు. ఉద్యోగిగా ఆయన సేవలను, అంకితభావాన్ని, సాధించిన విజయాలను గురించి సహోద్యోగులు, అధికారులు ప్రసంగిస్తారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగికి వీడ్కోలు పలికి, వారి శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షిస్తారు. కొత్త శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించి మెమెంటోల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ,డి ఎల్ పి వో రాఘవన్,స్థానిక తహశీల్దార్ సి హెచ్. వెంకటేశ్వర్లు,ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్, గ్రామ సర్పంచ్ పిన్నిపోయిన శ్రీదేవి, గంటా రామ్మోహన్ రావు, ఏ ఎస్ ఆర్ కోటేశ్వరరావు,పి. విక్టర్, గుడివాడ డివిజన్ అధ్యక్షులు హరికృష్ణ, వెంకటరత్నం, ఎన్టీఆర్ జిల్లా గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం ట్రెజరర్ మహమ్మద్ రఫీ, రిటైర్డ్ డిప్యూటీ ఎంపీడీవో పరమాత్మ, జి కొండూరు మండలం గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు భూక్యా మురళి, జిల్లాలోని వివిధ మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు,జి.కొండూరుమండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పనిసరి

**(సి.హెచ్.ప్రతాప్)**

ఇటీవల దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్లు, డమ్మీ స్కూల్స్ అక్రమాల పెరుగుదల విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. అనుమతులు లేకుండా నడిచే, నాణ్యతా ప్రమాణాలు పాటించని సంస్థలు విద్యార్థులను అసత్య హామీలతో ఆకర్షించి, సరైన విద్య పొందే అవకాశాన్ని లేకుండా చేస్తున్నారు. కొన్ని డమ్మీ స్కూల్స్ విద్యను వ్యాపార వస్తువుగా మార్చి, కేవలం సర్టిఫికెట్లు ఇస్తూ విద్యార్థులను భ్రమలో పడేసి, వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఈ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తొమ్మిది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నేతృత్వంలో దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్ల పర్యవేక్షణ, నియంత్రణ విధానాలను రూపొందించేందుకు ఈ కమిటీ పని చేయనుంది. అనుమతులు లేని, నిబంధనలు పాటించని సంస్థలను గుర్తించడం, చట్టపరంగా చర్యలు తీసుకోవడం, వినియోగదారుల రక్షణ చట్టం కింద జరిమానాలు విధించడం ప్రధాన లక్ష్యాలు. ప్రస్తుతం కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాలు విద్యా వ్యవస్థను సమగ్రంగా, పారదర్శకంగా ఉంచే దిశగా ఉన్నాయి. తప్పుడు ప్రకటనలు, అసత్య హామీలను నిషేధించడం, ఫీజుల విషయమై స్పష్టత, ఫ్యాకల్టీ అర్హతలు, మౌలిక సదుపాయాల ప్రమాణాలు పాటించడం తప్పనిసరి. విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని అనుమతి లేకుండా ప్రచారం చేయకుండా ఉండే నిబంధన కూడా విద్యార్థుల హక్కులను కాపాడడంలో చక్కటి ముందడుగు. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం కూడా కీలకం. కేంద్ర మార్గదర్శకాలను స్థానిక స్థాయిలో అమలు చేయడం, అక్రమ కార్యకలాపాలను గుర్తించడం, తక్షణమే చర్యలు తీసుకోవడం రాష్ట్రాల బాధ్యత. తల్లిదండ్రులు, విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండి, అనుమతిలేని లేదా నాణ్యతలేని సంస్థలను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలి. విద్యా వ్యవస్థను సమర్థవంతంగా, నాణ్యంగా నిలబెట్టడానికి సమగ్ర అభ్యాసం పొందే, ఒత్తిడి లేని (స్ట్రెస్ ఫ్రీ) విద్యా విధానం అవసరం. విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఎదుర్కోకుండా, శ్రద్ధతో, సృజనాత్మకతను పెంపొందిస్తూ అభ్యాసం చేయగలిగేలా ఏర్పాటు చేయడం ముఖ్యమని ఈ సందర్భం సూచిస్తుంది. విద్యను వ్యాపారంగా మలుచుకునే వారిపై కఠినంగా వ్యవహరించడం, సరైన పాఠ్యపద్ధతులు, శిక్షణ, ఆధునిక వనరుల ఆధ్వర్యంలో అభ్యాసానికి అవకాశం కల్పించడం ద్వారా మాత్రమే విద్యార్థులు సృజనాత్మక, విశ్లేషణాత్మక, సమర్థవంతమైన వ్యక్తులుగా ఎదగగలుగుతారు. కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఈ మార్గంలో తొలి అడుగు మాత్రమే. దీనిని విస్తరించి, రాష్ట్రాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి కృషి చేయడం ద్వారా విద్యా వ్యవస్థ సమగ్రంగా,

# బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రీస్ అవార్డు వరించిన కృష్ణా మిల్క్ యూనియన్

## సి ఎమ్ చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా అవార్డును అందుకొన్న చైర్మన్ చలసాని ఆంజనేయులు




విజయవాడ పశ్చిమ అక్టోబర్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)“స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర” లక్ష్య సాధనలో భాగంగా ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలు, వ్యక్తులకు కు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ‘స్వచ్ఛాంధ్ర అవార్డుల’ ను ప్రకటించింది. ఈ అవార్డులను సోమవారం సాయంత్రం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయిడు చేతుల మీదగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా “బెస్ట్ స్వచ్ఛ ఇండస్ట్రీ” – మెగా/భారీ పరిశ్రమల కేటగిరి లో మొదటి ర్యాంకు కృష్ణా మిల్క్ యూనియన్ ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్, వీరవల్లి ఫ్యాక్టరీ కి వరించింది. ఈ అవార్డు ను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయిడు చేతుల మీదగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అందుకొన్నారు. గత ఆరు దశాబ్దాలుగా స్వచ్ఛమైన పరిసరాలలో, అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో పాలు మరియు పాల పదార్ధములను వినయోగదారులకు అందిస్తూ, దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధర, క్రమం తప్పకుండా బోనస్, పాడి రైతు మరియు పశు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ కు ఈ అవార్డు లభించటం సము చితం మరియు గర్వ కారణం. ఈ సందర్భముగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ ఈ అవార్డు ప్రదానం చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయిడు కి, మరియు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావటానికి విశేష కృషి చేసిన సమితి పాలకవర్గమునకు, సమితి అధికారులు/ సిబ్బందికి, మరియు సమితికి వెన్ను దన్నుగా నిలిస్తున్న సంఘ అధ్యక్షులకు, పాడి రైతులకు ఈ సందర్భముగా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు పాల్గొన్నారు.

# న్యాయ సహాయ క్లినిక్ ప్రారంభం




రాజన్న సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 6: (వార్తా ప్రభ ప్రతినిధి) 'సిరిసిల్లలోని రాజీవ్ నగర్ బస్తీ ఆసుపత్రి లో న్యాయ సహాయ క్లినిక్ ను డి-అడిక్షన్/రిహాబిలిటేషన్ సెంటర్, సోమవారం ఏర్పాటు చేయడం జరిగిం దని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా రాధిక జైస్వాల్ గారు మాట్లాడుతూ గౌరవ సభ్య కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ, హైదరాబాద్ ఆదేశాలతో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ మార్గదర్శకత్వంలో, డీఎం అండ్ హెచ్ ఓ రజిత సమన్వయంతో, పోలీస్ సూపరింటెండెంట్ గీతే మహేష్ బాబాసాహెబ్ అనుమతితో న్యాయ సహాయ క్లినిక్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతోజు భాస్కర్, లోక్ అదాలత్ సభ్యులు, ప్రవీణ్, మానసిక వైద్య నిపుణులు, మణివర్మ, మెడికల్ ఆఫీసర్, స్వాతి, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# 'రంగరాయ'లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు

## –కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి



**కాకినాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఎంతో ప్రాముఖ్యత ఉన్న కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ సమావేశాల్లో కాకినాడ జిజిహెచ్ ను ప్రధానమంత్రి స్వస్త్య సురక్ష యోజన (PMSSY) పథకంలో చేర్చి అభివృద్ధి చేయాలని కోరగా, ఈ పథకం ద్వారా కేవలం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అభివృద్ధి పనులు మాత్రమే ఆర్థిక సహాయం అందజేస్తామని కేంద్రం స్పష్టం చేసిందన్నారు, దీనికనుగుణంగా కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీని PMSSY పథకంలో చేర్చి 330 పడకల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా గార్ని కలిసి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. ఆర్ఎంసిలో ప్రతి యేటా 250 మంది ఎంబిబిఎస్, 203 మంది పీజీ, 10 మంది సూపర్ స్పెషాలిటీ నిపుణులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు, అయితే ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ బ్లాకు లేకపోవడం వల్ల జనరల్ మెడిసిన్, సర్జరీ విభాగాలపై భారం పడుతుందన్నారు. కార్డియాలజీ, న్యూరో సర్జరీ, ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ మరియు క్రిటికల్ కేర్ విభాగాలతో కూడిన 330 పడకల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు కాకినాడ గవర్నమెంట్ ఐటిఐ ఆవరణలో 3.24 ఎకరాలు, కేన్సర్ సెంటర్ కు 0.30 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి కి వివరించినట్లు తెలిపారు. ప్రతియేటా 8 లక్షలకు పైగా ఓపి, 71 వేలు ఐపీ కేసులు, 50 వేలకు పైగా సర్జరీలు జరుగుతున్న ఆసుపత్రికి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం జరిగితే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు, గిరిజన ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పీజీ సూపర్ స్పెషాలిటీ కోర్సులకు అర్హత లభిస్తుందని, త్వరితగతిన PMSSY ద్వారా సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి జెపి నడ్డా ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# అంతర్గత డ్రైనేజీల అభివృద్ధిపై దృష్టి పెట్టండి..

## -మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే రాము..



**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణ పరిధిలోని అంతర్గత డ్రైనేజీల సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. ఏలూరు రోడ్‌లోని ప్రజావేదిక కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శివారు కాలనీలైన ధనియాలపేట కాలనీ, వాంబే కాలనీ, న్యూ ఇందిరానగర్ కాలనీల్లో రూ.10 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. సత్యనారాయణపురంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై అధికారులతో ఎమ్మెల్యే రాము చర్చించారు. ముఖ్యంగా పట్టణంలోని అంతర్గత డ్రైనేజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రత్యేక ప్రణాళికలతో వాటిని అభివృద్ధి పరచాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ.. పట్టణంలో శానిటేషన్ మెరుగుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో గుడివాడ సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే టిడ్కో కాలనీ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో బోర్ వెల్స్ ద్వారా వస్తున్న నీటి నాణ్యతను తెలుసుకునేందుకు ల్యాబ్ కు పంపుతున్నట్టు చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ సమీక్ష సమావేశంలో గుడివాడ ఆర్డీఓ బాల సుబ్రహ్మణ్యం, కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎం.ఈ ప్రసాద్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, లింగం ప్రసాద్, పంద్రాజు సాంబయ్య, మున్సిపల్ డి.ఇలు శివాజీ, సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నాయకులు నోరు అదుపులో పెట్టుకోండి




**తిరువూరు,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణంవిజయవాడ ఎంపీ కేశినేని.శివనాథ్ ( చిన్ని) పై తిరువూరు నగర పంచాయతీ 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండించిన తిరువూరు మండల టౌన్ ఎస్సీ నాయకులుమోదుగు ప్రసాద్ తన స్థాయిని దాటి మాట్లాడుతున్నాడని మా ఎంపీ చిన్ని ఆణిముత్యం లాంటి వారిని నువ్వు గుర్తు పెట్టుకో నీకు ఇప్పుడు దళిత కార్డు గుర్తొచ్చిందా మీ జగన్ పాలనలో దళిత డాక్టర్ సుధాకర్ ని గుండు కొట్టించిన విషయం మర్చిపోయావా ఒక ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేసిన విషయంమర్చిపోయావా అయ్యా మోదుగు ప్రసాద్ నువ్వు దళిత మహిళను చైర్మన్ పదవి దింపటంలో ముఖ్య పాత్ర పోషించావు. ఆమెను ఆర్థికంగా హింసించావు నీ ప్రవర్తన బాగోలేకే నీ తోటి కౌన్సిలర్లు టిడిపి వైపువచ్చారువిజయవాడ ఉత్సవ పేరిట విజయవాడ ను ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది మా చిన్నిమీకు సూటిగా సవాల్ విసురుతున్నాం చిన్ని గారు ఈ సంవత్సర కాలంలో విజయవాడ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధిని ఆడియో రూపంలో గానీ వీడియో రూపంలో గానీ నీకు పంపిస్తాం అది చూసిన తర్వాత నీకు మాట్లాడటానికి కూడా మాటలు రావని మోదుగు ప్రసాద్ నివ్యంగ్యంగా విమర్శించారుమేము నిన్న పార్టీ కార్యాలయం ప్రారంభించి సంతోషం ఉంటే నువ్వు ప్రెస్ మీట్ పెట్టి విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నావ్

# హనుమాన్ జంక్షన్ లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన పైడి సుధాకర్



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ఆర్యవైశ్య మహాసభ ఈసీ మెంబర్ గా పనిచేసిన హనుమాన్ జంక్షన్ కు చెందిన పైడి సుధాకర్ చేతుల మీదుగా ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి గా పనిచేసిన కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని వాసవీ కళ్యాణ మంటపం లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి ప్రార్థన మందిరం అధ్యక్షులు బొమ్మిశెట్టి రామారావు , ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు కపిలవాయి భగవతి , ఆర్యవైశ్య మహాసభ ఈసీ మెంబర్ తవ్వా పూర్ణచంద్రరావు , తవ్వా కుటుంబరావు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐలయ్యకు గుర్రం జాషువా పురస్కార ప్రధానం




**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** తెలుగు భాషా వికాస్ సమిత ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోం లో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భీమేశ్వరాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు వీర వెంకట సత్యనారాయణ (చిన్నా) మాట్లాడుతూ ఎవరైతే జాషువా అని అసమానతులతో అవమానపరిచారు వారే గండ పెండారం తొడిగి ఘన సన్మానం చేశారని అది జాషువా పాండిత్యానికి నిదర్శనం అన్నారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన ప్రముఖ ఉపాధ్యాయుడు పిల్లలమర్రి పిన వీరభద్ర కళాపీఠం గ్రంథాలయ వ్యవస్థాపకులు అని లేసు ను కీర్తిశేషులు గుర్రం జాషువా సాహితీ స్ఫూర్తి పురస్కారం 2025 ను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష వికాసంతి సమన్వయకర్త డిఆర్బి ప్రసాద్, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ నేలపాటి శామ్యూల్ జిల్లా ఎన్జీవో నాయకులు షేక్ ఫరీద్ వాసవి క్లబ్ జిల్లా నాయకులు గాదె మోహన్ బాబు సాహితీవేత్తలు అభిప్రాయం వెంకటేశ్వరరావు మోకా మాధవరావు పేట తిరుపాల్ గుప్తా చోడవరపు రూప లంక సురేంద్ర కొమ్ముల సురేష్ ఉపాధ్యాయులు శకుంతల పివిఎన్ వి రాజకుమారి శ్రీనిది కంప్యూటర్ ఫౌండర్ పి అనిల్ టైలర్ అసోసియేషన్ అధ్యక్షులు లంకపల్లి లాజర్ జనతా ప్రసాద్ కళ్లేపల్లి బ్రహ్మాజీ కావూరి శ్రీధర్ ఆదిరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన అవసరం - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు మండలంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం కల్పిస్తున్నట్లు ఎంపీడీవో చిన్న రాట్నాలు మీడియా సమావేశంలో తెలియజేశారు. వ్యవసాయ వస్త్ర మెడికల్ తదితర రంగాలలో ప్రతి కొనుగోలుదారుడు హోల్ సేల్ మరియు రిటైల్ రంగం ఏదైనా పొదుపు చేసుకునే పెద్ద మొత్తంలో జీఎస్టీ తగ్గించడం జరిగిందని ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసే సమయంలో సమగ్ర సమాచారాన్ని తెలుసుకొని ముందడుగు వేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు. మండలంలో ప్రజలకు గడపగడపకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధులకు గుడివాడ వాకర్స్ & విశ్వంభర ట్రస్ట్ సేవలు



**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ అండ్ విశ్వంభర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కర్ల కోటేశ్వరరావు ఆశ్రమంలో విశ్వంభర ట్రస్ట్ జేసీరేట్ పూర్వాధ్యక్షురాలు సిహెచ్ శ్రీదేవి పుట్టినరోజు వేడుకలు నిరాడంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు రగ్గులు మరియు భోజన సదుపాయం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డివి సత్యనారాయణ సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి ట్రెజరర్ మోహన్ రావు 204 గవర్నర్ ఎలెక్ట్ ఎం సి హెచ్ నారాయణరెడ్డి పిఆర్వో ఎం వీరశేఖర్ సిహెచ్ మల్లిక్, లక్ష్మీ కుమారి డిప్యూటీ గవర్నర్ పామర్తి కేశవరావు ఇతర వాకర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం.. ప్రాణాంతకం

## –గుడివాడ డిఎస్పీ ధీరజ్ వినీల్



**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రోడ్డు భద్రత కార్యక్రమాల్లో భాగంగా గుడివాడ డి.ఎస్.పి వి.ధీరజ్ వినీల్ సోమవారం మల్లయ్య పాలెం లో హెల్మెట్ లేని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నాణ్యత కలిగిన హెల్మెట్ 1000 రూపాయలు ఖరీదు కాగా, హెల్మెట్ లేకుండా చేసే ప్రయాణానికి అపరాధ రుసుము 5వేల వరకు కట్టవలసి ఉంటుందని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ ను నడపాలని తెలియజేశారు.

# కిడ్నీ బాధితునికి గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.15 వేలు ఆర్థిక సాయం




**అమలాపురం,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** అమలాపురం రూరల్ మండలం బండారు లంక గ్రామానికి చెందిన సరెళ్ల వెంకట ఆనంద్ కు రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కిడ్నీ బాధితుడు వెంకట ఆనంద్ వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. సోమవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయం లో రమణారావు రూ.15 వేలు చెక్కును బాధితుడు వెంకట ఆనంద్ కు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు వెంకట ఆనంద్ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్ సి సెల్ కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ వైసిపి నాయకులు పందిరి సుబ్బరాజు,శ్రీను, నేరేడుమిల్లి శ్రీను,నేలపూడి సుగంధ కుమార్,దంగేటి సుబ్బు,గంటా లక్ష్మీ ప్రసాద్,గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పెరికీడు గంగానమ్మ దేవస్థానంలో ఘనంగా జరిగిన 9 వ వార్షికోత్సవం



**హనుమాన్ జంక్షన్, అక్టోబరు 6 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం పెరికీడు గ్రామం లోని గ్రామదేవత గంగానమ్మ తల్లి 9వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గంగానమ్మ పరివార దేవతలు వినాయ కుడు, సుబ్రమణ్య స్వామి, కాల భైరవ స్వామి , పోతు రాజు లకు కూడా అర్చకులు శ్యామ్ అర్చనలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టి కోటేశ్వరరావు వాణిశ్రీ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పుట్టి రాంబాబు, నక్కా బాబు, సీతమ్మ ,రాజులపాటి శ్రీనివాసరావు, నండూరి సత్య వేంకటేశ్వర శర్మ. పుట్టి వంశీ కృష్ణ,పల్లపోతు జాన్ ప్రకాష్, జెట్టి ప్రతాప్, పల్నాటి తేజ తదితరులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

# బాణాసంచా విక్రయ దుకాణాల తనిఖీలు

## -కేసులు కలిగి ఉన్న 20 మందిపై 20 లక్షల రూపాయలకు ముందస్తు బైండోవర్..

**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు ఆదేశాల మేరకు, డిఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో గుడివాడ రూరల్ ఇన్స్పెక్టర్ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు సూచనలతో ఎస్.ఐ ఎన్. చంటిబాబు, పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాణాసంచా విక్రయ దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బొమ్ములూరు గ్రామంలో గతంలో కేసులు కలిగి ఉన్నా 20 మందిని ఒక్కొక్కరికి లక్ష చొప్పున 20మందిని 20లక్షలకు గుడివాడ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయించడం అయినది. అక్రమంగా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.

# గుడివాడలో నిర్మితమవుతున్న భారీ ఫ్లేవర్ బ్రిడ్జికి ఎంపీ బాలసౌరి పేరు పెట్టాలి

## -ఎమ్మెల్యే రాము, ఆర్డీవో బాలసుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేసిన అభిమానులు..




**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పట్టణంలోని రైల్వే గేట్లపై నిర్మితమవుతున్న భారీ ఫ్లేఓవర్ బ్రిడ్జికి మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలసౌరి పేరు పెట్టాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గుడివాడ ప్రజా వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యంకు బాలసౌరి అభిమానులు దాసరి మహేష్, మణికుమార్, దిలేష్ కన్నా సోమవారం ఉదయం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఎంపీ బాలసౌరి అవిశ్రాంత కృషి ఫలితంగానే 300 కోట్ల పైగా నిధులతో ఫ్లే ఓవర్ బ్రిడ్జి నిర్మితమవుతుందనీ, గుడివాడ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఆయన పేరును బ్రిడ్జికి పెట్టడం సముచితమన్నారు. ఈ విషయమై కలెక్టర్ తో పాటుగా ప్రభుత్వ పెద్దలకు కూడా వినతిపత్రం అందిస్తామని మహేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పంద్రాజు సాంబయ్య, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బాలశౌరీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కీ॥ శే॥ వలవల పెద్దిరాజులు జ్ఞాపకార్థంగా వారి కుమారులు సురేంద్ర కుమార్, నరేష్ ల సహకారంతో నీలామహల్ రోడ్ లో (అల్లం బడి స్కూల్లో అంగన్వాడీ కేంద్రానికి) వంట పాత్రలు వితరణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, జాజుల తాతారావు, స్కూల్ హెచ్ఎం నాగ రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :

# తపాలా వారోత్సవాల సందర్భంగా ఆధార్ శిబిరాలు

**కాకినాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ఈ నెల 6 నుంచి 10 వరకు జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు, అప్డేట్ సేవలను నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. కృష్ణ తెలిపారు. వారంరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్డేట్ శిబిరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో పిఠాపురం భాష్యం హైస్కూలు, నీలపల్లి గిరియంపేట ఉన్నత పాఠశాలలో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. 10,11 తేదీల్లో ఏలేశ్వరం ఎంపీపీ ప్రధాన పాఠశాల, గాడిమొగ సావిత్రినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరాలు కొనసాగుతాయని, ఈ నెల 13,14 తేదీల్లో పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాల, డి. పోలవరం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. వీటితోపాటు పోస్టాఫీస్ పొదుపు ఖాతాలు, సుకన్య సమృద్ధియోజన ఖాతాలు, పీపీఎఫ్ ఖాతాలు తెరచుకునే వెసలుబాటు కల్పిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి..

## -బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు

**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** జనగణనలో కులగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం మేరకు బీసీల రిజర్వేషన్ ఏబీ సీడీలుగా వర్గీకరణ చేశాక, జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికంగా ఉన్న బీసీలు రాజ్యాధికా రానికి నోచుకోలేదని, వారికి న్యాయం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే లోపల కూటమి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలని మల్లేశ్వరరావు కోరారు.

# బంకు ల్లో ఇవి ఫ్రీ.. లేదంటే ఫిర్యాదు చేయండి




**పెనుగంచిప్రోలు, అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పెట్రోల్ బంకుల్లో ఫ్రీగావాటర్, టాలెట్స్, ఫస్ట్ ఎ యి డ్ కిట్, టై ర్లకు గాలి అందించాలి, ఫ్యూయల్ పై డౌట్ ఉంటే కస్టమర్ కొలత, క్వాలిటీ చెక్ఎ క్విస్ మెంట్ అడగవచ్చు, చాల చోట్ల నీళ్ళుం డవు, మూత్రశాలలు దుర్గంధం తో వాడలేము. ఇక టైర్లలో ఎయిర్ కు చిల్లర డిమాండ్ చేస్తే స్థాయికి చేరింది. మీరు ఈ సమస్య ఎదుర్కొంటే ఫిర్యాదు చేయవచ్చు.. బీపి సి ఎల్- 1800224344,హెచ్ పి సి ఎల్-18002333555..ఐ ఓ సి ఎల్..1800233355... రియలన్స్.. 18008919023... నెంబర్ల కు పిర్యాదు చేయండి.

# ప్రణవాశ్రమంలో అన్నసమారాధన



**గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ధనియాలపేట ప్రణవాశ్రమం పర్యవేక్షణలోని శ్రీ బాలత్రిపుర సుందరిదేవి ఓంకారేశ్వర స్వామి ఆలయంలో విజయదశమి ఉత్సవాలు జయప్రదం ముగిసినందున రమారమీ 2వేల మంది భక్తులకు ఏర్పాటుచేసిన అన్న సమారాధనను ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సైర్య చైతన్యానందస్వామి పర్యవేక్షణలో టిడిపి నాయకులు జగన్మోహనరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పంద్రాజు సాంబయ్య, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, లయన్స్ క్లబ్ గుడివాడ ప్రగతి నేతలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో దివంగత మూడే శ్రీనివాసరావు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, యాదవ సంఘం అధ్యక్షులు గోరిపర్తి నాగబాబు మరియు వారితో పాటు కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నా చిత్రాలు

–పామర్రు,అక్టోబరు 6 (వార్తాప్రభ) :

# కలంకారీ క్లస్టర్ ఏర్పాటు చేసి తీరతాం

- స్పష్టం చేసిన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్
- భూముల బదలాయింపుని అడ్డుకున్న ఆ నలుగురిపై ధ్వజమెత్తిన వేణుగోపాలరావు





**పెదన,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పెదన పట్టణంలో కలంకారి క్లస్టర్ ను కచ్చితంగా ఏర్పాటు చేసి తీరతామని శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా క్లస్టర్ ఏర్పాటుతథ్యమని చెప్పారు. క్లస్టర్ ఏర్పాటుకు భూములు బదలాయించే విషయమై అంశం కౌన్సిల్ కు వెళ్ళింది. ఈ అంశాన్ని వైసిపి కౌన్సిల్ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై సోమవారం నాడు స్థానిక దేవాంగ కళ్యాణ మండపంలో కలంకారి ఆర్టిజన్ అసోసియేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైసిపి కౌన్సిలర్ల వైఖరికి నిరసనగా ఉమ్మడి సమావేశం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు బళ్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్లస్టర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని చెప్పారు. క్లస్టర్ ఏర్పాటులో అవగాహన కోసం కొంతమందిని ఇతర రాష్ట్రాలకు కూడా పంపించటం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసమే క్లస్టర్ ఏర్పాటు అని అన్నారు. ఇందులో రాజకీయాలకు తావులేదని కాగిత చెప్పారు. భూములను బదలాయించే విషయంలో కౌన్సిల్ అభ్యంతరం చెప్పడం విచారకరమని అన్నారు. ఈ విషయం తనకు బాధ కలిగించిందని అన్నారు.ఎలా ఏర్పాటు చేయాలో తమకు తెలుసని కృష్ణ ప్రసాద్ చెప్పారు.

**ఆ నలుగురి పై వేణుగోపాలరావు ఫైర్..**

క్లస్టర్ ఏర్పాటుకు భూములను బదలాయించే అంశాన్ని అడ్డుకున్న నలుగురు కౌన్సిలర్ల పై బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ఫైర్ అయ్యారు. వైస్ చైర్మన్ కాజా కౌన్సిలర్లు కటకం ప్రసాద్ మెట్ల గోపి ప్రసాద్ గరికముక్కు చంద్రబాబు లనుద్దేశించి ఆయన పేర్లు ప్రస్తావించి మరీ విమర్శించారు. వారు అభివృద్ధి నిరోధకులని అన్నారు. ఈ పరిశ్రమపై నియోజకవర్గంలో పదివేల మంది జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ భూములను కౌన్సిల్ ఎం ఎస్ ఎం ఈ కి బదలాయింపు చేస్తే వారి నుంచి లీజుకు తీసుకోవటం జరుగుతుంది అని తెలిపారు. జనసేన కౌన్సిలర్ శివపావని నలుగురు రాబందులతో పోరాడిందని అభినందించారు. త్వరలోనే వైసీపీ కౌన్సిలర్లకు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ ఇన్చార్జి చైర్మన్ అబ్దుల్( హన్ను ) పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య జనసేన కౌన్సిలర్ మట్ట శివ పావని ఊటుకూరు శ్రీగిరి కట్టా హేమ సుందర మూర్తి కట్టా మునీశ్వర రావు మత కట్టా మునీశ్వర రావు బల్ల పద్మావతి బీజేపీ అధ్యక్షులు గుప్తా కారుపర్తి శ్రీనివాస్ జంపన శ్రీనివాస్ యర్రా రాజా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# టమోటా రైతులకు అండగా ఉంటాం

-రైతులు ఆందోళన చెందొద్దని హామీ ఇచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టమోటా ధరలపై రైతులకు భరోసా ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు, రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఆదివారం రాప్తాడు మార్కెట్‌లో టమోటా ధరలు గరిష్టం రూ.18, కనిష్టం రూ.9, మోడల్ ధర రూ.12గా ఉన్నాయి. 30%-%40 మెట్రిక్ టన్నుల సరుకు పత్తికొండ మార్కెట్‌కు వస్తుందని, దసరా సెలవుల కారణంగా 10 టన్నులు అదనంగా చేరినట్లు, రోడ్లపై 2వ గ్రేడ్ క్వాలిటీ టమాటాలు వేసి గందరగోళం సృష్టించబడినట్లు మంత్రి వివరించారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామని, ఈ రోజు పత్తికొండ మార్కెట్ నుంచి 10 మెట్రిక్ టన్నులు చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్‌కు, 15 మెట్రిక్ టన్నులు రైతు బజార్లకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు సరుకు వర్షాల కారణంగా తగ్గిన నేపథ్యంలో, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల టమాటా అమ్మకాలు మందగించాయని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ప్రస్తుతం టమాటాలకు ట్రెండింగ్ ధర బట్టి రైతులకు మంచి ధర లభిస్తోంది. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# నందిగామ మున్సిపాలిటీలో వార్డుల పెంపు - పారదర్శకంగా సాగిన ప్రక్రియ

-ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** సోమవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్ బాబు జగ్జీవన్ రామ్ బిల్డింగ్ నందు చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ వార్డుల విభజనపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం నందిగామ పట్టణం 7.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 54,830 మంది జనాభాతో ఉన్నది. వీరిలో 36,388 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. నగర పంచాయతీ స్థాయి నుంచి ఇటీవల గ్రేడ్%-%2 మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిన నందిగామలో ఇప్పటివరకు 20 వార్డులు ఉండగా, జనాభా పెరుగుదల దృష్ట్యా వీటిని 28 వార్డులుగా విభజించే ప్రతిపాదన ఆమోదం పొందింది. ప్రస్తుతం ప్రతి వార్డులో సగటుగా 1,500%-%1,600 ఓట్లు ఉండగా, తాజా నిబంధనల ప్రకారం ఒక్కో వార్డులో 1,150%-%1,400 ఓటర్లు మాత్రమే ఉండాలి. ఈ కారణంగా వార్డుల పెంపు అవసరమైందని సమావేశంలో వెల్లడించారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ "నందిగామ పట్టణ అభివృద్ధి దిశగా ఇది కీలకమైన అడుగు. పారదర్శకంగా పని చేస్తూ ప్రతి దశలోనూ ప్రజలకు సమాచారం అందించాము. అన్ని నోటీసు బోర్డుల ద్వారా ప్రజలకు వివరాలు తెలియజేశాము. ఈ ప్రక్రియకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు,పట్టణ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వార్డుల పెంపు ప్రతిపాదనను అధికారికంగా సమర్పించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ నిర్ణయంతో నందిగామ మున్సిపాలిటీ భవిష్యత్తు ఎన్నికలు 28 వార్డుల ఆధారంగా జరగనున్నాయని ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య గారు తెలియజేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కే లోవరాజు,వార్డు కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలి

- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 182 అర్జీలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అర్జీదారులతో సంబంధిత అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్మెంట్ తప్పకుండా ఇవ్వాలని చెప్పారు. వ్యవహార శైలి, పరిష్కార విధానం సరిగా లేవన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితిలోనూ రాకూడదని స్పష్టం చేశారు. రీ ఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నియోజకవర్గ విజన్ కార్యాచరణ ఈప్రణాళిక యూనిట్ క్రియాశీలతకు సమష్టిగా కృషిచేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌తో పాటు కీలక ప్రగతి సూచికల పై కూడా దృష్టిసారించాలని సూచించారు.

**జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 182 అర్జీలు:** సోమవారం జరిగిన జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 182 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూ విభాగంలో అత్యధికంగా 53, పోలీస్ 36, పురపాలక, పట్టణాభివృద్ధి 24, పంచాయతీరాజ్ 14, రవాణా 10, డీఆర్‌డీఏ 9, ఆరోగ్యశాఖ 6, పౌరసరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, దేవాదాయ శాఖ, విద్యాశాఖ, బ్యాంకులకు సంబంధించిన అర్జీలు మూడు చొప్పున, ఎక్సైజ్, మార్కెటింగ్, సర్వే శాఖలకు సంబంధించిన అర్జీలు రెండు చొప్పున, గనులు, భూగర్భ శాఖ, నీటిపారుదల, గృహ నిర్మాణం, గ్రామీణ నీటిసరఫరా, కార్మిక, ఉపాధి కల్పన, రిజిస్ట్రేషన్ - స్టాంపులు, నైపుణ్యాభివృద్ధి, డ్వామా శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ అందాయి. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# ఇన్షా అల్లా అందరిని చల్లగా చూడాలి

-బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి, బాపూనగర్ ఈద్గా రోడ్ దగ్గర బాపునగర్ టిప్పు సుల్తాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గార్వి సెలబ్రేషన్స్ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ పాల్గొన్నారు. అక్టోబర్ 5వ తేదీ ఆదివారం నాడు విందు కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ గార్వి షరీఫ్ హాజరత్ సైడ్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానిబ్ పిరానా- ఈ- పీర్ గౌస్- ఈ- అజాం దస్తగిర్ సందర్భంగా నిర్వహించిన ఈ గ్యార్వి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇన్షా అల్లా అందరిని చల్లగా చూడాలని అందరూ బాగుండాలని అన్నారు. మతాల కతీతంగా ఈ గార్వి పండుగను చేసుకుంటారని అన్నారు. టిప్పు సుల్తాన్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గఫూర్, ఫయాజ్,షేక్ ఆసిఫ్ సయ్యద్ ఖదీర్ మొహమ్మద్ ముక్రం మొహమ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# "సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్"కరపత్రాల పంపిణీ

-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం పట్టణంలోని కోర్టుల రోడ్డు మరియు సీఎం రోడ్డు ప్రాంతాల్లో జరిగిన సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాపారస్తులకు జి ఎస్ టి సంబంధిత ప్రయోజనాలు, సేవింగ్స్ వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా వ్యాపారులు జి ఎస్ టి వ్యవస్థలోని సూపర్ సేవింగ్స్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వ్యాపారులతో మాట్లాడుతూ, "ప్రభుత్వం వ్యాపారుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్ ద్వారా మీరు మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చు. ఈ కరపత్రాలలో వివరాలు ఉన్నాయి, వాటిని ఉపయోగించుకోండి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి,ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ లోవరాజ్, వార్డ్ కౌన్సిలర్లు,స్థానిక వ్యాపార సంఘాల ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు. వ్యాపారులు ఎమ్మెల్యే గారి చొరవకు స్వాగతం పలికారు మరియు జి ఎస్ టి సంబంధిత సందేహాలను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం పట్టణంలోని వ్యాపార వర్గాలకు మరిన్ని అవగాహన కల్పించింది.

# ఎలక్ట్రిక్ కుండల తయారి ఉపయోగించడంపై శిక్షణా తరగతులు





**విజయవాడ/మైలవరం,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల పరిధిలోని గణపవరం గ్రామంలో ఎలక్ట్రిక్ కుండలు తయారి,చక్రాల ఉపయోగించడంపై సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర కార్యాలయం, విజయవాడ, రాష్ట్ర సంచాలకులు డాక్టర్. ఎస్. గ్రిప్ ఆధ్వర్యంలో ప్రారంభించిన శిక్షణ తరగతులలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద ఎలక్ట్రిక్ కుండల తయారి, చక్రాలు ఉపయోగిం చడంపై పలువురికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పి. ఈశ్వర్ మాట్లాడుతూ ఈ పది రోజుల శిక్షణా తరగతులు వినియోగం చేసుకుని ఆధునిక పద్ధతులు ద్వారా ఉత్పత్తి ఏ విధంగా పెంచు కోవాలి, ఆధునిక యంత్రాలను ఏ విధంగా ఉపయోగించాలో తెలుసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ అభ్యర్థులు ఈ పది రోజుల శిక్షణా తరగతుల్లో పాల్గొని ఆధునిక పరికరాల వినియోగాన్ని తెలుసుకొని తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడం అదేవిధంగా తమ ఉత్పత్తుల ద్వారా గణపవరం గ్రామం యొక్క ఖ్యాతిని పెంచాలని తెలియజేశారు. ఆర్. ఎల్. ఎన్. మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్-II, ఎస్ ఒ కె వి ఐ సి విజయవాడ, మాట్లాడుతూ KVIC గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద సాంప్రదాయ గ్రామీణ చేతివృత్తుల వారిని గుర్తించి వివిధ రకాలైన చేతివృత్తులలో ఆదాయాన్ని పెంచుటకు మరియు ఆధునిక పద్ధతులను ఉపయోగించడం లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామోద్యోగ్ వికాస్ యోజన కార్యక్రమం వల్ల, చేతివృత్తులవారు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి మరియు ఎక్కువ ఆదాయం మరియు తక్కువ శ్రమను పొందడం కొరకు మెరుగైన టూల్స్/ఎక్విప్ మెంట్ పై పనిచేయుట ద్వారా ప్రయోజనం పొందుతారు. శిక్షణ పొందిన వారందరికీ మెరుగైన టూల్స్ ఎక్విప్మెంట్ కూడా అందజేయడం జరుగుతుంద ని వెల్లడించారు. ఈ శిక్షణా తరగతులు అక్టోబర్ 06 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని డాక్టర్. ఎస్. గ్రిప్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 20 మంది వరకు శిక్షణ పొందుటకు ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో 50 నుంచి 60 మంది పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# వాల్యుబుల్ మెటీరియల్ అన్న జువ్వ అప్పారావు



**విస్సన్నపేట,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పురాతన భవనమైన విస్సన్నపేట మండల ప్రజా పరిషత్తు భవనం ఓపెన్ ఆక్షన్ సమాచారం ఆనందదాయకం అని రామ్ సాయి ఐరన్ సిమెంట్ అండ్ పెయింట్ అధినేత జువ్వ అప్పారావు అన్నారు. కిటికీలు డోర్లు ఫర్నిచర్ మేలు జాతి రకం అని ఒక అంచనా ఉన్నది అన్నారు. ఓపెన్ ఆక్షన్ ఏర్పాటు చేయడం వలన ఎక్కువ ధర పలికే అవకాశం ఉన్నది అని చెప్పారు. రహదారులు మేరువా చేసుకునేందుకు మేరువా మట్టి ఎంతో ఉపయోగపడుతుందని పూర్వకాలంలో భవనాల పునాదులలో ప్రస్తుతం మేరువా కొరకు గ్రావెల్ తో ఫుల్ చేసే విధంగా గతంలో గానుగ సున్నంతో నిర్మించిన భవనం నిర్మాణాల పునాదులలో ఇసుక పోసే వారని కావున ఇసుక ధర ఎన్ని యూనిట్లు ఉంటుందన్న అంచనా వేసుకుని వేలం ధర పెరిగే అవకాశం ఉంటుంది అని ఆయన తెలియజేశారు.

# గూడూరులో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం



**పెదన,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** పెదన నియోజకవర్గం గూడూరులో సోమవారం నాడు రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. గత నెల 17వ తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈనెల 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా డి సి చైర్మన్ పోతన స్వామి నాయుడు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు ముఖ్యంగా బాలింతలు గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిడిపిఓ గ్లోరీ మాట్లాడుతూ మహిళాభ్యుదయం కోసం ప్రభుత్వాలు వందల కోట్లు ఖర్చు పెడుతున్నాయని అని చెప్పారు. నియోజకవర్గంలో పోషణ మాస ఉత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు సంఘ మధుసూదన్ రావు జెడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు ఎంపీడీవో శైలజా కుమారి తాసిల్దార్ రాజ్యలక్ష్మి ఐసిడిఎస్ సూపర్వైజర్ రేవతి ఉష వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ బాబురావు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**మచిలీపట్నం,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** చివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) 1500వ జయంతి సందర్భంగా మల్కపట్నంలో నిర్వహించిన రక్తదాన శిబిరం, గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. దీనిలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిబిరం యొక్క ప్రధాన లక్ష్యం రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి ఈ లక్ష్యం విజయవంతంగా సాధించబడింది. ఈ రక్తదాన శిబిరం లో మానవాళి సేవలో వందలాది మంది రక్తదానం చేశారు. ప్రజల ఉత్సాహంతో పాల్గొనడం మన సమాజం ఎల్లప్పుడూ పేదలకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని నిరూపించింది. మొత్తం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బృందం స్వచ్ఛంద సేవకులు ప్రధాన పాత్ర పోషించారు. శిబిరంలో అన్ని భద్రత ఆరోగ్య ప్రమాణాలను ఖచ్చితంగా పాటించారు, తద్వారా రక్తదాతలు ఎటువంటి అసౌకర్యాన్ని ఎదుర్కోలేదు. రక్తదాతలను ప్రశంసా పత్రాలతో సత్కరించారు వారి సేవకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం మన సమాజం ఎల్లప్పుడూ "రక్తదానం" వంటి మంచి పనికి సిద్ధంగా ఉందని పేదలకు సహాయం చేయడానికి ముందుకు వస్తుందని నిరూపించింది. ఈ శిబిరాన్ని విజయవంతం చేయడంలో తమ పాత్ర పోషించిన దాతలు స్వచ్ఛంద సేవకులకు గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ కృతజ్ఞతలు తెలియజేస్తోంది. భవిష్యత్తులో కూడా ఇటువంటి సంక్షేమ పనులను నిర్వహిస్తూనే ఉంటుంది, తద్వారా మరింత మందికి సహాయం అందించబడుతుంది.

# నందమూరు పంచాయతీ కి కు ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ అవార్డు



**నందమూరు,అక్టోబరు 6 (వార్తాప్రభ) :** నందమూరు గ్రామపంచాయతీకి ఉత్తమ గ్రీన్ అవార్డు లభించింది మచిలీపట్నం జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలు లో సోమవారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ 2025 లో కృష్ణా జిల్లా స్థాయి లో నందమూరు గ్రామపంచాయతీ లో పని చేయుచున్న గ్రీన్ అంబాసిడర్ ఊసల రంగారావుకు ఈ అవార్డును అందజేశారు. కృష్ణా జిల్లా ఇంచార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ రాష్ట్ర ఆర్ టి సి చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు కృష్ణా జిల్లా కలెక్టరు డి కే బాలాజీ చేతుల మీదుగా పెదన మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ అరుణ కుమారి సమక్షం లో ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ అవార్డు తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొల్లిపర జానకి కూడా పాల్గొన్నారు



ఇటీవల సెప్టెంబర్ 5వ తారీఖున రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ ఉపాధ్యాయుల పుష్కారాల్లో భాగంగా ఎంపికయి "జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల" అవార్డు పొందిన లోయ అనంతలక్ష్మి నీ ఆదివారం గుడివాడ యాదవ సంఘం తరఫున సత్కరిస్తున్న చిత్రం
-గుడివాడ,అక్టోబరు 6 (వార్తాప్రభ) :

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188